ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమీకరించి అంశాలను విశ్లేషిస్తూ ముస్తాబయి మీ ముంగిటకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక

సుభల అక్షరం



తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం

ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి

EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com

www.aksharamtelugudaily.com

RNI NO: TELTEL/2018/75419

సుభల

అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

అగ్నివీరులకు మరో రెండేళ్ల సర్వీసు!

- 75 శాతం మందికి అదనపు సేవా అవకాశం
- కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం
- ఆరేళ్ల తర్వాత సాధారణ సైనికులుగా చేరే అవకాశం



FRIDAY 6TH NOVEMBER 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 230 COST : 3\- KHAMMAM, TELANGANA

శుక్రవారం 06 నవంబర్ , 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక :230 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJ-GIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం

- రూ.2 వేల కోట్లతో రహదారుల విస్తరణ
- జీ+3 విధానంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ నిరంతర తాగునీరు
- రూ.27.50 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నల్లగొండ, నవంబర్ 5 అక్షరం న్యూస్:

నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ రూ.2 వేల కోట్లతో రెండు వరుసల రహదారుల విస్తరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు జీం3 విధానంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారి జీవన ప్రమాణాలను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాబోయే ఏడాదిన్నరలో నల్లగొండలోని ప్రతి ఇంటికీ 24 గంటల పాటు నిరంతర తాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. నీటి సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, గృహ నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు.

వివరాలు 2లో



నాగౌర్‌లో భారీ పేలుడు... ఇద్దరు మృతి

- బాణసంచా పేలుడుతో ఒక్కసారిగా కలకలం
- రెండు కిలోమీటర్ల దూరం వరకు వినిపించిన శబ్దం
- భయంతో ఇళ్ల నుంచి పరుగులు తీసిన ప్రజలు
- ఘటనాస్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

నాగౌర్, నవంబర్ 5 అక్షరం న్యూస్:

రాజస్థాన్‌లోని నాగౌర్ ప్రాంతంలో భారీ పేలుడు సంభవించి ఇద్దరు మృతి చెందారు. బాణసంచా పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఏం జరిగిందో తెలియక స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనతో నాగౌర్ ప్రాంతంలో ఒక్కసారిగా కలకలం రేగింది. పేలుడు తీవ్రత ఎంత ఎక్కువగా ఉందంటే సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకు శబ్దం వినిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు ధాటికి పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఉలిక్కిపడ్డారు. కొందరు ఇళ్ల నుంచి బయటకు వచ్చి ఘటనాస్థలానికి వెళ్లగా, మరికొందరు భయంతో సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. బాణసంచా పేలుడు కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది.



వివరాలు 2లో



వరదల్లో చిక్కుకున్న ప్రతి ఒక్కరినీ సురక్షితంగా రక్షించడం అభినందనీయం

02

- సహాయక బృందాల సేవలను ప్రశంసించిన మంత్రి పొంగులేటి
- సత్తుపల్లిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాల అధికారులతో సమీక్ష
- రెండు మూడు రోజుల్లో నష్టం అంచనా నివేదికలు ఇవ్వాలని ఆదేశం
- దెబ్బతిన్న మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు సూచనలు

పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రతిభకు పురస్కారాలు

02

- ఉత్తమ రాష్ట్రాలు, సంస్థలకు అవార్డుల ప్రదానం
- పురస్కారాలు అందజేసిన ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్
- ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంలోనూ ప్రతిభకు గుర్తింపు
- స్వచ్ఛ ఇంధన వినియోగం పెంపునకు ప్రోత్సాహం



జపాన్‌కు చేరుకున్న భారత యుద్ధనౌక సహ్యాద్రి

- మలబార్-2026 విన్యాసాల్లో పాల్గొనేందుకు రాక
- యోకోసుకా నౌకాదళ స్థావరంలో ఘన స్వాగతం
- భారత్-జపాన్ రక్షణ సంబంధాలకు మరింత బలం
- నౌకకు స్వాగతం పలికిన జపాన్ నౌకాదళ అధికారులు

02





తెలంగాణ పెట్టుబడుల సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు

- డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహణ
- ఆరు ప్రదర్శనశాలలు.. 52 రంగాలవారీ సమావేశాలు
- రక్షణ, ఔషధ, వ్యవసాయ, విద్యారంగాలకు ప్రత్యేక వేదికలు
- ఏర్పాట్లపై సమీక్షించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 5అక్షరం న్యూస్:

తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా నిలపడంతో పాటు ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు, భవిష్యత్తు పరిశ్రమలకు వేదికగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహించనున్న తెలంగాణ ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్-2026కు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఈ సదస్సు జరగనుంది. ఏర్పాట్ల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సదస్సు వేదిక, ప్రదర్శనశాలలు, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, భద్రత, వసతి, కార్యక్రమాల నిర్వహణపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు.

వివరాలు 2లో



మొదటిపేజీ తరువాయి

అగ్నివీరులకు మరో రెండేళ్ల సర్వీసు!

న్యూఢిల్లీ, నవంబర్ 5 అక్షరం న్యూస్:

అగ్నిపథ్ పథకంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పు తీసుకొచ్చింది. నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన తర్వాత సాధారణ సైనికులుగా ఎంపిక కాని 75 శాతం మంది అగ్నివీరులకు మరో రెండేళ్ల పాటు సాయుధ దళాల్లో సేవలందించే అవకాశం కల్పించింది. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గం అదనపు సేవా కాలానికి ఆమోదం తెలిపింది. ఇప్పటికే అమల్లో ఉన్న ప్రతిభ ఆధారంగా 25 శాతం మందిని సాధారణ సైనికులుగా కొనసాగించే విధానం యథాతథంగా ఉంటుంది. మిగిలిన వారికి కూడా మరో అవకాశం కల్పించడం ద్వారా సైన్యంలో కొనసాగాలనే ఆశలు ఉన్న యువతకు ఊరట లభించనుంది.అగ్నిపథ్ పథకం అమలులోకి వచ్చిన నాలుగేళ్ల తర్వాత సాయుధ దళాలు నిర్వహించిన సమీక్షలో అగ్నివీరుల పనితీరుపై సానుకూల అభిప్రాయాలు వ్యక్తమైనట్లు రక్షణ శాఖ వెల్లడించింది. శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం, విధుల పట్ల అంకితభావం వంటి అంశాల్లో అగ్నివీరులు మెరుగైన ప్రతిభ కనబరిచినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో సైనిక దళాల సిఫారసుల మేరకు అదనపు రెండేళ్ల సేవా అవకాశానికి కేంద్రం ఆమోదం తెలిపింది. సంస్థాగత అవసరాలు, సైనిక సామర్థ్యం, యువత ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.అదనంగా రెండేళ్లు సేవలందించే అగ్నివీరులకు గతంలో కంటే అధిక వేతనం చెల్లించనున్నారు. అలాగే సేవా నిధి ప్యాకేజీని పెంచడంతో పాటు సీనియారిటీ ప్రయోజనాలు కూడా కల్పించనున్నారు. నాలుగేళ్ల ప్రాథమిక సేవ అనంతరం మరో రెండేళ్లు కొనసాగడం ద్వారా మొత్తం ఆరేళ్ల పాటు సాయుధ దళాల్లో పనిచేసే అవకాశం లభిస్తుంది. ఈ అదనపు సేవా కాలానికి సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలు కూడా పెరగనున్నాయి. దీంతో నాలుగేళ్ల తర్వాత విధుల నుంచి తప్పుకోవాల్సి వస్తుందనే ఆందోళనలో ఉన్న అగ్నివీరులకు కొంత ఉపశమనం కలగనుంది. ఆరేళ్ల సేవ పూర్తయిన అనంతరం సైన్యంలో కొనసాగేందుకు ఆసక్తి చూపే అగ్నివీరులకు సాధారణ సైనికులుగా చేరే అవకాశం కల్పించనున్నారు. అయితే ఇందుకు నిర్దేశించిన ఎంపిక ప్రమాణాలు, అర్హతలను తప్పనిసరిగా పూర్తి చేయాల్సి ఉంటుంది. కేవలం ఆరేళ్ల సేవ పూర్తయినంత మాత్రాన అందరికీ సాధారణ సైనికులుగా నియామకం లభించదు. అభ్యర్థుల అంగీకారం, అర్హతలు, ఎంపిక ప్రక్రియ ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటారు. ఈ మార్పుతో అగ్నిపథ్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో సాధారణ సైనికుడిగా మారేందుకు మరో అవకాశం ఏర్పడనుంది. 2022 జూన్ 14న ప్రారంభమైన అగ్నిపథ్ పథకంలో తొలి విడత అగ్నివీరుల నాలుగేళ్ల సేవా కాలం ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు నాలుగేళ్ల సేవ అనంతరం 25 శాతం మందికి మాత్రమే సాధారణ సైనికులుగా కొనసాగే అవకాశం ఉండగా, తాజా మార్పుతో మిగిలిన 75 శాతం మందికి మరో రెండేళ్ల సేవా అవకాశం లభించింది. రక్షణ రంగంలో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించడంతో పాటు సైనిక దళాల అవసరాలను తీర్చడమే ఈ మార్పు ప్రధాన ఉద్దేశమని రక్షణ శాఖ వెల్లడించింది.

మొదటిపేజీ తరువాయి

జపాన్‌కు చేరుకున్న భారత యుద్ధనౌక సహ్యాద్రి

న్యూఢిల్లీ, నవంబర్ 5 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): భారత నౌకాదళానికి చెందిన స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన అత్యాధునిక రహస్య యుద్ధనౌక ఐఎన్ఎస్ సహ్యాద్రి జపాన్‌లోని యోకోసుకా నౌకాదళ స్థావరానికి చేరుకుంది. మలబార్-2026 సంయుక్త నౌకాదళ విన్యాసాల్లో పాల్గొనేందుకు ఈ యుద్ధనౌక అక్కడికి చేరినట్లు భారత నౌకాదళం వెల్లడించింది. సముద్ర భద్రత, పరస్పర సహకారం, రక్షణ రంగంలో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఈ విన్యాసాలు నిర్వహించనున్నారు. యోకోసుకా నౌకాదళ స్థావరానికి చేరుకున్న ఐఎన్ఎస్ సహ్యాద్రికి జపాన్ సముద్ర స్వీయ రక్షణ దళం ఘనంగా స్వాగతం పలికింది. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన స్వాగత కార్యక్రమంలో యోకోసుకా జిల్లా కమాండెంట్ వైస్ అడ్మిరల్ యాగి కోజీ, టోక్యోలోని భారత రాయబార కార్యాలయ ఉప మిషన్ అధిపతి ఆర్. మధుసూదన్ పాల్గొన్నారు. ఇరు దేశాల నౌకాదళాల మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలకు ఈ కార్యక్రమం ప్రతీకగా నిలిచింది. భారత్‌లోనే స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన సహ్యాద్రి యుద్ధనౌక ఆధునిక రక్షణ సామర్థ్యాలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. అంతర్జాతీయ సముద్ర జలాల్లో భారత నౌకాదళ సామర్థ్యాన్ని చాటడంతో పాటు మిత్రదేశాలతో సంయుక్త విన్యాసాల్లో పాల్గొనడం ద్వారా కార్యాచరణ అనుభవాన్ని పెంపొందించుకుంటోంది. మలబార్ విన్యాసాల్లో ఈ నౌక భాగస్వామ్యం భారత్ సముద్ర రక్షణ వ్యూహంలో కీలకమైన అంశంగా భావిస్తున్నారు.

మలబార్ సంయుక్త నౌకాదళ విన్యాసాల్లో భారత్‌తో పాటు జపాన్, అమెరికా, ఆస్ట్రేలియా నౌకాదళాలు పాల్గొంటాయి. సముద్రంలో సంయుక్త కార్యాచరణ, సమాచార మార్పిడి, సమన్వయం, పరస్పర సహకారాన్ని మెరుగుపరచడం ఈ విన్యాసాల ప్రధాన ఉద్దేశం. వివిధ దేశాల నౌకాదళాలు కలిసి పనిచేయడం ద్వారా ప్రాంతీయ సముద్ర భద్రతను బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. ఐఎన్ఎస్ సహ్యాద్రి రాకతో మలబార్-2026 విన్యాసాల్లో భారత నౌకాదళం భాగస్వామ్యం మరో కీలక దశకు చేరింది. భారత్, జపాన్ మధ్య రక్షణ రంగంలో పెరుగుతున్న సహకారానికి యోకోసుకా స్వాగత కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది. సముద్ర మార్గాల భద్రత, ప్రాంతీయ స్థిరత్వం, స్వేచ్ఛాయుత సముద్ర ప్రయాణానికి మద్దతుగా భాగస్వామ్య దేశాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కానుంది.

వరదల్లో చిక్కుకున్న ప్రతి ఒక్కరినీ సురక్షితంగా రక్షించడం అభినందనీయం

సత్తుపల్లి, నవంబర్ 5అక్షరం న్యూస్:

మురసు తుపాను ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఏర్పడిన వరద పరిస్థితులు, జరిగిన నష్టం, చేపట్టిన సహాయక చర్యలను రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సత్తుపల్లిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాల కలెక్టర్లు, పోలీసు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బేతుపల్లి చెరువు వద్ద వరదల్లో చిక్కుకున్న మత్స్యకారులను, వారిని రక్షించేందుకు వెళ్లి ప్రమాదంలో చిక్కుకున్న రాష్ట్ర విపత్తు స్పందన దళం సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన జిల్లా యంత్రాంగం, రాష్ట్ర విపత్తు స్పందన దళం, జాతీయ విపత్తు స్పందన దళం, పోలీసు, అగ్నిమాపక శాఖల సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. దమ్మపేటలో దెబ్బతిన్న అలుగు ప్రాంతాన్ని, సత్తుపల్లిలో వరద నీటిలో మునిగిన రెండు పడక గదుల ఇళ్లను మంత్రి పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వరద బాధితులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వరదల్లో ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా రాత్రంతా శ్రమించి సహాయక చర్యలను విజయవంతం చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ బాధితులకు అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విపత్తు స్పందన వ్యవస్థను బలోపేతం చేసిందని, సుమారు 1,900 మంది సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు రూ.260 నుంచి రూ.270 కోట్లతో ఆధునిక రక్షణ పరికరాలను సమకూర్చినట్లు వివరించారు.భారీ వర్షాల కారణంగా చెరువుల కట్టలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ వ్యవస్థలు దెబ్బతినడంతో పాటు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు మంత్రి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో పూర్తి నివేదికలు సమర్పించాలని సూచించారు. దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, చెరువుల కట్టలు, విద్యుత్ వ్యవస్థల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. వరద సహాయక చర్యల్లో పాల్గొన్న విపత్తు స్పందన దళాల సిబ్బందిలో ఇందిరమ్మ ఇళ్లు లేని అర్హులను గుర్తించి వారికి ఇళ్లు అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని వెల్లడించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో ముందుగానే అధికారులను అప్రమత్తం చేసి సహాయక బృందాలను క్షేత్రస్థాయిలో మోహరించినట్లు వివరించారు. అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి ప్రాంతాల్లో ఆకస్మిక వరదల్లో చిక్కుకున్న వారిని డ్రోన్లు, రక్షణ కవచాలు, తాళ్ల సహాయంతో సురక్షితంగా బయటకు తీసుకొచ్చినట్లు తెలిపారు. దమ్మపేటలో ఆలయ దర్శనానికి వెళ్లిన 11 మంది గిరిజనులను కూడా రక్షించినట్లు చెప్పారు. ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు 9 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించామని, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సమగ్ర నివేదిక అందిస్తామని వెల్లడించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, జాతీయ విపత్తు స్పందన దళం కెప్టెన్ కిరణ్ సహాయక చర్యల వివరాలను మంత్రికి వివరించారు.గత 30 గంటల్లో అశ్వారావుపేటలో 411 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఫోన్ సంకేతాలు, ప్రాంత గుర్తింపు వివరాలు, భౌగోళిక స్థాన నిర్ధారణ సమాచారం, యంత్ర సహాయంతో నడిచే పడవల ద్వారా వరదల్లో చిక్కుకున్న వారి ఆచూకీ గుర్తించి రక్షించినట్లు అధికారులు వివరించారు. సమావేశంలో భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ మహేందర్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా పంచాయతీ అధికారి అనూషతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వరద బాధితులకు తక్షణ సహాయం అందించడంతో పాటు దెబ్బతిన్న వ్యవస్థలను త్వరితగతిన పునరుద్ధరించడమే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి అధికారులకు సూచించారు.

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ పెట్టుబడుల సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు

సదస్సుకు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ప్రత్యేక అనుసంధాన అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే నమోదు, ప్రవేశ అనుమతుల జారీ ప్రక్రియ పూర్తిచేయాలని, కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ముందుగానే అందించాలని సూచించారు. ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రాక నుంచి తిరుగు ప్రయాణం వరకు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారి, భద్రతా అధికారిని నియమించి పటిష్ఠ భద్రత కల్పించాలని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనకు ఆసక్తి చూపే సంస్థల ప్రతినిధులను ఆహ్వానించాలని, నవంబర్ 15 నాటికి సమ్మిట్ ఏర్పాట్ల పూర్తి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి మరింత విస్తృతంగా ఆరు ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

రక్షణ, అంతరిక్షం, వైమానిక, సైబర్ భద్రత రంగాల్లో ఆధునిక పరిజ్ఞానాన్ని పరిచయం చేసేందుకు ప్రత్యేక రక్షణ ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇందులో డ్రోన్లు, రోబోటిక్స్, రక్షణ పరికరాలను ప్రదర్శించడంతో పాటు వైమానిక విన్యాసాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు 575 సంస్థలను ఆహ్వానించగా, ఇప్పటివరకు 49 సంస్థలు ఆసక్తి చూపాయి. యానిమేషన్, దృశ్య ప్రభావాలు, ఆటల రూపకల్పన, హాస్య చిత్రకథల రంగాలకు సంబంధించి ఇండియా జాయ్-2026 నిర్వహించనున్నారు. నూతన సంస్థల కోసం ప్రత్యేక ప్రదర్శనశాల ఏర్పాటు చేసి 136 సంస్థల ఆవిష్కరణలను పరిచయం చేయనున్నారు. తెలంగాణ నూతన ఆవిష్కరణల సవాలులో భాగంగా వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా మౌలిక సదుపాయాలకు సాంకేతిక పరిష్కారాలను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు నవంబర్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఔషధ, జీవశాస్త్ర రంగాలకు చెందిన 60 సంస్థల ప్రదర్శనతో పాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ డ్రోన్లు, పాడి, మత్స్య, ఆహార శుద్ధి రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించనున్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, చేనేత, బతుకమ్మ, కాకతీయుల శిల్పకళతో పాటు రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలను ప్రతిబింబించేలా ప్రత్యేక తెలంగాణ ప్రదర్శనశాల ఏర్పాటు చేయనున్నారు. పర్యాటక రంగానికి మరింత ప్రాధాన్యం ఇచ్చి రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక విద్యా ప్రదర్శన నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు నాలుగు ప్రధాన సమావేశ మందిరాల్లో 52 రంగాలవారీ చర్చలు జరగనున్నాయి. మొత్తం 25 రంగాల కార్యనిర్వాహక మండళ్లను ఏర్పాటు చేయగా, సుమారు 3,500 ఆహ్వానాలు పంపించారు. అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, వసతి, భద్రత, ప్రదర్శనల నిర్వహణ కోసం పది అధికారుల కమిటీలను నియమించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్ సభ్యులుగా ఉన్న మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ముఖ్యమంత్రి సూచించారు.వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు డిసెంబర్ 8న ప్రత్యేకంగా తెలంగాణ వాతావరణ సదస్సు నిర్వహించనున్నారు. ఇందులో సుమారు 200 మంది శాస్త్రవేత్తలు, రైతులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొననున్నారు. కరువును తట్టుకునే వ్యవసాయం, పశు సంరక్షణ, తాగునీటి భద్రత, అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షణ, అడవులు, జీవవైవిధ్య పరిరక్షణ, వ్యర్థాలను సంపదగా మార్చడం వంటి అంశాలపై చర్చించనున్నారు. వాతావరణ మార్పుల వల్ల ఇప్పటికే ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక పరిష్కారాలు రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

నాగౌర్‌లో భారీ పేలుడు.. ఇద్దరు మృతి - బాణసంచా పేలుడుతో ఒక్కసారిగా కలకలం

నాగౌర్, నవంబర్ 5 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): రాజస్థాన్‌లోని నాగౌర్ ప్రాంతంలో భారీ పేలుడు సంభవించి ఇద్దరు మృతి చెందారు. బాణసంచా పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఏం జరిగిందో తెలియక స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనతో నాగౌర్ ప్రాంతంలో ఒక్కసారిగా కలకలం రేగింది. పేలుడు తీవ్రత ఎంత ఎక్కువగా ఉందంటే సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకు శబ్దం వినిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు ధాటికి పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఉలిక్కిపడ్డారు. కొందరు ఇళ్ల నుంచి బయటకు వచ్చి ఘటనాస్థలానికి వెళ్లగా, మరికొందరు భయంతో సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. బాణసంచా పేలుడు కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది.ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం వెలువడింది. పేలుడు జరిగిన ప్రాంతంలో పరిస్థితి భీతావహంగా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించాయి. మృతుల వివరాలు, ప్రమాదానికి సంబంధించిన పూర్తి సమాచారం సేకరిస్తున్నారు.

ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పేలుడు జరిగిన ప్రాంతాన్ని అధికారులు పరిశీలిస్తూ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. బాణసంచా నిల్వలు, వాటి నిర్వహణకు సంబంధించిన అంశాలపై కూడా విచారణ చేపట్టే అవకాశం ఉంది. ప్రమాదంలో మరెవరైనా గాయపడ్డారా అనే వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. బాణసంచా నిల్వలు, తయారీ, వినియోగం విషయంలో తగిన భద్రతా ప్రమాణాలు పాటించకపోతే ఇలాంటి ప్రమాదాలు తీవ్ర ప్రాణనష్టానికి దారితీస్తాయని ఈ ఘటన మరోసారి హెచ్చరిస్తోంది. పేలుడు నేపథ్యంలో స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రమాదానికి ఖచ్చితమైన కారణాలు, మృతులకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

మొదటిపేజీ తరువాయి

పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రతిభకు పురస్కారాలు

న్యూఢిల్లీ, నవంబర్ 5 అక్షరం న్యూస్:

దేశంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు స్వచ్ఛ ఇంధన రంగాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో నిర్వహించిన భారత్ పునరుత్పాదక ఇంధన సదస్సు, ప్రదర్శన--2026 ముగింపు కార్యక్రమం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరై వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్రాలు, ప్రభుత్వ శాఖలు, విక్రేతలు, బ్రాండ్ యజమానులు, ప్రభుత్వ రంగ బ్యాంకులకు పురస్కారాలు అందజేశారు. పునరుత్పాదక ఇంధన రంగంలో విశేష కృషి చేసిన సంస్థలను గుర్తించి ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిలిచింది.ఈ సందర్భంగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, ప్రభుత్వ విభాగాలకు విశిష్టత పురస్కారాలను ఉపరాష్ట్రపతి ప్రదానం చేశారు. సౌర, పవన, ఇతర పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచేందుకు చేపట్టిన కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన కల్పించడం, స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడం వంటి అంశాల్లో సాధించిన విజయాలకు గుర్తింపుగా ఈ పురస్కారాలు అందించారు. దేశవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన రంగంలో పోటీతత్వాన్ని పెంచడంతో పాటు వివిధ రాష్ట్రాలు, సంస్థలు మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రోత్సహించడంలో ఈ అవార్డులు కీలకంగా నిలవనున్నాయి.ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం అమలులో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి కూడా ఉపరాష్ట్రపతి ప్రత్యేక పురస్కారాలు అందజేశారు. గృహాలపై సౌర విద్యుత్ పలకల ఏర్పాటును ప్రోత్సహించడం, సామాన్య ప్రజలకు సౌర విద్యుత్ అందుబాటులోకి తీసుకురావడం, విద్యుత్ ఖర్చులను తగ్గించడం వంటి లక్ష్యాలతో ఈ పథకం అమలవుతోంది. పథకం అమలులో భాగస్వాములైన విక్రేతలు, బ్రాండ్ యజమానులు, ప్రభుత్వ రంగ బ్యాంకులు అందించిన సేవలను గుర్తించి అవార్డులతో సత్కరించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో వీరి పాత్రను ప్రశంసించారు.దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించి పర్యావరణహిత ఇంధన వనరులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ విధానాలు, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం కీలకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ రంగంలో విశేష కృషి చేసిన వారికి పురస్కారాలు అందించడం ద్వారా మరిన్ని సంస్థలు స్వచ్ఛ ఇంధన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే అవకాశం ఏర్పడుతుంది.భారతదేశాన్ని స్వచ్ఛ ఇంధన రంగంలో ప్రపంచస్థాయిలో ముందంజలో నిలపాలనే లక్ష్యానికి ఇలాంటి సదస్సులు, పురస్కారాల కార్యక్రమాలు దోహదపడనున్నాయి. పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఇంధన భద్రతను బలోపేతం చేయవచ్చు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్రాలు, సంస్థలను ఉపరాష్ట్రపతి సత్కరించడం స్వచ్ఛ ఇంధన రంగంలో మరింత ఉత్సాహాన్ని నింపింది. దేశవ్యాప్తంగా సౌర విద్యుత్ సహా పునరుత్పాదక ఇంధన వనరుల విస్తరణకు ఈ గుర్తింపులు ప్రేరణగా నిలవనున్నాయి.

నిండు గర్భిణిని వాగు దాటించిన సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి

ప్రజల నుండి,అధికారుల నుండి ప్రశంసల వెల్లువ

కూలిపోయిన వంతెన... ఉధృతంగా వాగు...

అయినా ఆగని సర్పంచ్ సేవ

ప్రాణాలకు తెగించి మరీ గర్భిణికి అండగా నిలిచిన మూకమామిడి సర్పంచ్

వరదలోనే వాగు దాటి గర్భిణిని ఆస్పత్రికి చేర్చిన సాహసం

రాత్రి పగలు తేడా లేకుండా ప్రజల కోసం పరుగులు పెడుతున్న సర్పంచ్

ఆపదలో వెన్నంటుండే నాయకురాలు

- కోర్సా ఆదిలక్ష్మి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ నవంబర్ 5 /అక్షరం న్యూస్:

మురసు తుఫాను వల్ల గత రెండు రోజులుగా కురిసిన ఎడతెరిపిలేని భారీ వర్షానికి వాగు ఉగ్రరూపం దాల్చి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.మూకమామిడి – మొగరలగుప్ప గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి పూర్తిగా కూలిపోయింది.ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనే మొగరలగుప్ప గ్రామానికి చెందిన ఒక మహిళకు గురువారం పురుడు నొప్పులు ప్రారంభమయ్యాయి.ఆస్పత్రికి వెళ్లాలంటే తెగిపోయిన వంతెన దాటి, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఏం చేయాలో తెలియక కుటుంబ సభ్యులు ఆందోళనలో ఉండగా,విషయం తెలుసుకొని వెంటనే మూకమామిడి గ్రామపంచాయతీ సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు.

తానే స్వయంగా దగ్గరుండి...

ప్రాణాలకు తెగించి,వరద నీటిలోకి దిగి,గ్రామస్తులు,యువకుల సహాయంతో నిండు గర్భిణిని సురక్షితంగా వాగు దాటించారు.ప్రమాదాల అంచుల నుండి ఆమెను ఒడ్డుకు చేర్చి ఆస్పత్రికి పంపించే ఏర్పాట్లు చేశారు.సర్పంచ్ చూపిన తెగువ,మానవత్వం చూసి గ్రామస్తులందరూ అభినందించారు.

ఆపదలో అండగా నిలిచే



నాయకురాలు...

గత రెండు రోజులుగా రాత్రి,పగలు తేడా లేకుండా,వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పంచాయతీ ప్రజల కోసం సర్పంచ్ ఆదిలక్ష్మి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు.వాగులో చిక్కుకున్న వ్యక్తిని కాపాడటం నుండి,తెగిపోయిన వంతెన వద్ద ప్రజలను అప్రమత్తం చేయడం వరకు ప్రతి చోటా ముందుండి సేవ చేస్తున్నారు. సర్పంచ్ ఈ మానవత్వపూర్వక సేవను చూసి గ్రామస్తులు, యువకులు, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున ప్రశంసలు కురిపించారు.అధికారులు సైతం సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి ని ప్రత్యేకంగా అభినందించారు.ఇలాంటి సర్పంచ్ ఉండటం మా అదృష్టం అంటూ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఆపదలో వెన్నంటుండే నాయకురాలుగా సర్పంచ్ మరోసారి నిరూపించుకున్నారని ప్రజలు కొనియాడుతున్నారు.

మాధారం అంగన్వాడీ అద్దె భవనంలో బురద మాయం

చిన్నారులు అంగన్వాడీ స్కూల్ వెళ్లాలి అంటే నరకయాతన.

మాదారం గ్రామంలో నూతన అంగన్వాడీ భవనం వెంటనే నిర్మించాలి.

తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్ డిమాండ్.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి/ నవంబర్ 5 /అక్షరం న్యూస్:

మురుసు తూఫాన్ కారణంగా మాధారం అంగన్వాడీ అద్దె భవనం అధ్వాన్నంగా తయారైందని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని మాదారంలోని అంగన్వాడీ కేంద్రాన్ని అయన సందర్శించి గ్రామస్తులు, అంగన్వాడీ టీచర్లు,చిన్నారులతో కలిసి అంగన్వాడీ ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అంగన్వాడీ కేంద్రానికి రాగానే మొత్తం బురద మాయం కనిపించడం తో కొంత మంది విద్యార్థులు వెనుతిరిగి ఇంటికి వెళ్ళి పోయినారని అన్నారు. మాదారం గ్రామంలో గత కొన్ని సంవత్సరాల నుంచి అంగన్వాడీ సెంటర్ కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం నిర్మించిన భవనం లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. అద్దె అంగన్వాడీ లో చిన్నారులకు టాయిలెట్లు లేక చిన్నారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మాదారం లోని 2 అంగన్వాడీ కేంద్రాలు ఒకే దగ్గర నడపడంతో పాటు చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మాదారం గ్రామంలో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్ల లకు నూతన భవనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చనగాని వినోద్, పసుల సూర్య, ముదిగొండ రవి, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వేముల లక్ష్మణ్ గౌడ్ మృతి తీరని లోటు

కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి: టీ యు ఎఫ్ నాయకుల డిమాండ్

కరీంనగర్/ జమ్మికుంట/, నవంబర్ 05/అక్షరం న్యూస్:

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీ యు ఎఫ్) నాయకులు పరామర్శించారు. ఆయన తండ్రి మల్లయ్య గౌడ్‌తో పాటు కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. లక్ష్మణ్ గౌడ్ మృతి ఉద్యమకారులకు, కుటుంబానికి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీ యు ఎఫ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి మాట్లాడుతూ.. 2006 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం లక్ష్మణ్ గౌడ్ అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు ఆయన భార్య స్వప్నకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన 1200 మంది అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. టీ యు ఎఫ్ ఫౌండర్ డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ఫోరం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్యామల, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్, రాష్ట్ర నాయకులు జోగు అంజన్న, దయానంద్, జిల్లా అధ్యక్షుడు రాజు, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరే రమేష్ రెడ్డి, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు మద్దూరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



భారీ వర్షాలకు ముత్యాలంపాడులో నీట మునిగిన వరి పంటలు

- ఆదుకోవాలని రైతుల ఆవేదన

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి/ నవంబర్ 5/ అక్షరం న్యూస్:

ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామపంచాయతీ పరిధిలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. ఎంతో కష్టపడి, అప్పులు చేసి సాగు చేసిన వరి పంట నీట మునిగి పూర్తిగా దెబ్బతింది. దీంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు.

అంచనా వేసిన వ్యవసాయ అధికారులు

గ్రామంలో పర్యటించిన మండల వ్యవసాయ శాఖ అధికారులు (ఏ.డి., ఏ.ఓ.) ప్రాథమికంగా పంట నష్టాన్ని పరిశీలించి సర్వే నిర్వహించారు. ముత్యాలంపాడు గ్రామ పరిధిలో సుమారు 30 ఎకరాల వరకు వరి పంట నీట మునిగి నష్టపోయినట్లు వారు ప్రాథమికంగా గుర్తించారు.

దెబ్బతిన్న రైతుల బతుకులు

ఈ సందర్భంగా ముత్యాలంపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ కల్లూరి కిషోర్ మాట్లాడుతూ.. తుఫాను ప్రభావంతో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద, బ్యాంకుల్లో అప్పులు చేసి పంటలు సాగు చేశామని, ఇప్పుడు చేతికి వచ్చిన పంట నీట కలవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు.

ప్రభుత్వానికి విజ్ఞప్తి

ప్రభుత్వం స్పందించి, వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా సమగ్రంగా పంట నష్టాన్ని అంచనా వేయించాలని సర్పంచ్ కోరారు. నష్టపోయిన ప్రతి రైతుకూ తగిన నష్టపరిహారం అందించి, ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతులుఆందోళనచెందుతున్నారు



హరిత సిరిసేడు.. ఇంటింటా మొక్కల పంపిణీ

పచ్చదనం పెంపొందించడమే లక్ష్యం.. ప్రజల ఆరోగ్యమే ముఖ్యం

సర్పంచ్ రేనుకుంట్ల శ్యామల-కుమార్

కరీంనగర్/ఇల్లందకుంట/, నవంబర్ 05/అక్షరం న్యూస్:

పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామంలో ఇంటింటా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం హరితహారంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేనుకుంట్ల శ్యామల--కుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా స్వచ్ఛమైన గాలితో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా అవి పెరిగే వరకు సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. సిరిసేడు గ్రామాన్ని పచ్చని హరితవనంగా తీర్చిదిద్దేందుకు గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు ఉమ్మగోని రమేష్, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల ఆరోగ్యమే గ్రామ భవిష్యత్తుకు పునాది

- అల్పాహార పథకాన్ని ప్రారంభించిన సర్పంచ్ మాచర్ల కుమారస్వామి

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ నవంబర్ 05/అక్షరం న్యూస్:-

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో గురువారం విద్యార్థుల కోసం అల్పాహార పథకాన్ని గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అల్పాహారాన్ని అందించారు.విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతోపాటు, చదువుపై ఏకాగ్రతను పెంపొందించేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ ఉత్సాహంతో విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఆరోగ్యమే గ్రామ భవిష్యత్తుకు పునాది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, ఉపసర్పంచ్ శనిగరం ఐలయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మాచర్ల లక్ష్మి, వార్డు సభ్యులు సంధ్య, శ్రీనివాసరెడ్డి, శ్యామ్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అండగా ఉంటాం.. ఆదుకుంటాం..

ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది : మంత్రి పొంగులేటి

సత్తుపల్లి, దమ్మపేట మండలాల్లో తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలన..

ఖమ్మం/ సత్తుపల్లి నవంబర్ 5(అక్షరం న్యూస్)

సత్తుపల్లి: మురసు తుపాను ప్రభావంతో భారీగా వరద నీరు చేరి దెబ్బతిన్న ప్రాంతాల్లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం పర్యటించారు. సత్తుపల్లి, దమ్మపేట మండలాల్లో తెగిన చెరువు కట్టలు, నీట మునిగిన పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధిత రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్లు దివాకర టీఎస్, అంకిత్‌లతో కలిసి బేతుపల్లి పెద్ద చెరువు ముంపు ప్రాంతంలోని పంట పొలాలను మంత్రి పరిశీలించారు. వరద తీవ్రత, పంటలకు జరిగిన నష్టంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దమ్మపేట మండలం నాగుపల్లి వద్ద మల్లెపూల వాగు ఉప్పొంగడంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.ముసలి బంధం చెరువు కట్టకు ఐదు చోట్ల గండ్లు పడిన ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గండుగులపల్లి వద్ద వాగు పరిసరాల్లో దెబ్బతిన్న కట్టను, దమ్మపేటలో తెగిపోయిన పేరంటాల చెరువు కట్టను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో వరద ఉధృతి, సహాయక చర్యలు, చేపట్టాల్సిన మరమ్మతులపై అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం సత్తుపల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రాంతంలోకి వరద నీరు చేరిన ప్రాంతాన్ని సందర్శించి స్థానిక పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. దెబ్బతిన్న చెరువు కట్టలకు తక్షణమే మరమ్మతులు చేపడతామని, పంట నష్టంపై వివరాలు సేకరించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్ 5.0

- పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ క్యాంపు ను సద్వినియోగం చేసుకోండి - పర్సనల్ విభాగాధిపతి

రామగిరి (పెద్దపల్లి జిల్లా) నవంబర్ 5 అక్షరం న్యూస్:



కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా అన్ని సంస్థల పెన్షనర్లలో డిజిటల్ సాధికారత పెంపు కొరకు నిర్వహిస్తున్న డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్ 5.0 లో భాగంగా రామగుండం -3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు నవంబర్ 09, 10 తేదీలలో రెండు రోజుల పాటు జి.ఎం ఆఫీస్ ముందు గల సెక్యూరిటీ కార్యాలయ ఆవరణ లో కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ గోదావరిఖని శాఖ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ రామగుండం -3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల సౌజన్యంతో నిర్వహిస్తున్న పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ (డి ఎల్ సి) సమర్పించడం కోసం నిర్వహిస్తున్న క్యాంపు ను సద్వినియోగం చేసుకోవాలని, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు తమ పెన్షన్ పొందుటకు, వారి వారి వార్షిక జీవిత ధ్రువీకరణ పత్రాలను(లైఫ్ సర్టిఫికెట్) ను డిజిటల్ రూపంలో సమర్పించుటకై సంబంధిత ధ్రువపత్రాలు (ఆధార్ కార్డ్, బ్యాంకు పాస్ బుక్, పి.పి.ఓ నంబర్ కాపీ, ఆదార్ లింక్డ్ మొబైల్ నెంబర్) వెంట తీసుకొని రావాలని రామగుండం -3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా పర్సనల్ విభాగాధిపతి యండి.ఆసిఫ్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

మోరసు తుఫాను ప్రభావం పొగళ్లపల్లిలో నీట మునిగిన పంటలు



క్షేత్రస్థాయిలో పరిశీలించిన సర్పంచ్ మడకం రవి, వ్యవసాయ విస్తరణ అధికారి రాహుల్

నష్టపోయిన రైతన్నలను ఆదుకుంటామని భరోసా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి /నవంబర్ 5 /అక్షరం న్యూస్:

మోరసు తుఫాను సృష్టించిన నష్టంతో పొగళ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు చేతికొచ్చిన పంటలు నీట మునిగిపోవడంతో రైతన్నలు ఆవేదన చెందుతున్నారు.గ్రామంలో వరి, వేరుశెనగ, మొక్కజొన్న, మినుము తదితర సాగు చేసిన పంటలు పూర్తిగా నీట మునిగి తీవ్ర



నష్టం వాటిల్లింది.వివరాలు సేకరించిన సర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారి రైతుల కష్టాలను స్వయంగా పరిశీలించేందుకు పొగళ్లపల్లి గ్రామ సర్పంచ్ మడకం రవి వ్యవసాయ విస్తర అధికారి రాహుల్ గారు క్షేత్రస్థాయిలో పర్యటించారు. నీట మునిగిన పొలాలను పరిశీలించి, ఏయే రైతుకు ఎంత మేర పంట నష్టం వాటిల్లిందనే వివరాలను రైతులను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు.ప్రభుత్వ పరిహారం అందేలా కృషి: సర్పంచ్ మడకం రవిఈ సందర్భంగా సర్పంచ్ మడకం రవి మాట్లాడుతూ... తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని తెలిపారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ఈ వివరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, ప్రభుత్వం నుంచి తగిన పరిహారం అందేలా పూర్తి స్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కష్టకాలంలో రైతన్నలకు పొగళ్లపల్లి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన ధైర్యం చెప్పారు. సర్పంచ్, అధికారుల చొరవపై గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పీఎస్ఎస్ ఫైర్ వర్క్స్ ప్రారంభించిన సర్పంచులు

రామగిరి (పెద్దపల్లి జిల్లా) నవంబర్ 05 అక్షరం న్యూస్:

రామగిరి మండలంలోని రత్నాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని బేగంపేట ఎక్స్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పీఎస్ఎస్ ఫైర్ వర్క్స్ దుకాణాన్ని రత్నాపూర్ గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమపీవీరావు, లద్నాపూర్ గ్రామ సర్పంచ్ వనం రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాపారం అభివృద్ధి చెందాలని, నిర్వాహకులు మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి కొమురయ్య గౌడ్, బండారి సదానందం, పుల్లెల సతీష్, బీవీ స్వామి గౌడ్, గిరవెన రాములు, బండ గోపాల్, సంధవెన కుమార్, కట్టెకోల మల్లేష్, గిరవెన రాకేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



రత్నాపూర్ లో పోచమ్మ జోగు ప్రారంభం

రామగిరి (పెద్దపల్లి జిల్లా) నవంబర్ 05

అక్షరం న్యూస్:

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో గురువారం సాయంత్రం పోచమ్మ జోగు ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ నెల 11,12వ తేదీలలో రత్నాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలో పోచమ్మ కొలుపు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మొదట గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు ఇంటికి వెళ్లి జోగు కార్యక్రమం ప్రారంభించారు. సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు రూ.3016/- జోగు కింద చెల్లించడం జరిగింది. గ్రామీణ తెలంగాణ సంస్కృతిలో, ఆచారాలలో పోచమ్మ జోగు (జోగమ్మ) ప్రక్రియ అత్యంత విశిష్టమైనది, భక్తిభావంతో కూడుకున్నది. ముఖ్యంగా బోనాలు, జాతరల సమయంలో గ్రామాన్ని చల్లగా చూడాలని, ఎలాంటి అరిష్టాలు రాకుండా కాపాడాలని పోచమ్మ తల్లిని వేడుకుంటూ ఈ జోగు ప్రక్రియను నిర్వహిస్తారు. గ్రామంలో పోచమ్మ జోగు వెనుక ఉన్న కథనం, దాని ప్రాముఖ్యత, విశేషాలు ఇక్కడ చూద్దాం:

జోగు అంటే ఏమిటి...?

'జోగు' అంటే జోగమ్మ లేదా పోచమ్మ తల్లి తరఫున గ్రామంలో భిక్షాటన (జోగం) చేయడం అని అర్థం. అమ్మవారికి సమర్పించే ముడుపులు, నైవేద్యాల కోసం గ్రామంలోని ప్రతి ఇంటా తిరిగి బియ్యం, పసుపు, కుంకుమ, నూనె లేదా కానుకలను సేకరించడాన్ని 'జోగు అడగడం' అంటారు.

జోగు వెనుక ఉన్న కథనం ఏ నమ్మకం:-

పూర్వ కాలం నుండి గ్రామాల్లో కలరా, ప్లేగు, మశూచి (అమ్మవారు) వంటి అంటువ్యాధులు వ్యాపించినప్పుడు, లేదా వర్షాలు పడక కరవు వచ్చినప్పుడు గ్రామస్తులంతా పోచమ్మ తల్లి ఆగ్రహించిందని నమ్మేవారు. అమ్మవారిని శాంతింపజేయడానికి ఊరిలో ఉన్న జోగమ్మ (పోచమ్మకు అంకితమైన భక్తురాలు) లేదా పూజారి ఆధ్వర్యంలో ఈ జోగు ప్రక్రియ మొదలవుతుంది. అమ్మవారికి ఒక్కరే పూజ చేయడం కంటే, ఊరిలో ఉన్న ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలనేది ఈ కథనం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం. అందరి ఇళ్ల నుండి సేకరించిన దాంతోనే అమ్మవారికి బోనం వండుతారు.

జోగు సాగే విధానం:-

వేషధారణ...జోగు అడిగే జోగమ్మ లేదా భక్తులు ఒంటి నిండా పసుపు రాసుకుని, నొసట పెద్ద కుంకుమ బట్టు పెట్టి, వేప ఆకులను తలలో లేదా నడుముకు



కట్టుకుంటారు. బోనం కుండ...నెత్తిన ఒక చిన్న కుండ (జోగు కుండ) పెట్టుకుని, చేతిలో వేప మండలు పట్టుకుని ఊరేగింపుగా బయలుదేరుతారు. వీరితో పాటు పోతురాజులు, డప్పు చప్పుళ్లు ఉంటాయి. ఇంటింటి భిక్ష...ప్రతి ఇంటి ముందుకు వెళ్లి "అమ్మో... పోచమ్మ తల్లి జోగు..." అంటూ పిలుస్తారు. గ్రామస్తులు భక్తితో జోగమ్మ కాళ్లు కడిగి, ఆమె తెచ్చిన గంపలో లేదా కుండలో బియ్యం, డబ్బులు వేస్తారు. ఆ సమయంలో జోగమ్మ వేప మండలతో ఇళ్లపై, ప్రజలపై నీళ్లు చల్లి "చల్లగా ఉండాలి" అని దీవిస్తుంది.

ముగింపు - ఊరి పాలిమేర

దాటించడం:-

ఇంటింటి నుండి సేకరించిన బియ్యం, పప్పులతో పోచమ్మ గుడి వద్ద పెద్ద ఎత్తున సాక (బోనం) తయారు చేస్తారు. అమ్మవారికి నైవేద్యం పెట్టి, జంతు బలులు (కోళ్లు లేదా మేకపోతులు) ఇస్తారు. చివరగా, ఊరికి ఉన్న రోగాలను, కష్టాలను అన్నింటినీ ఒక గంపలో పెట్టి (దీనిని 'బలి గంప' అంటారు), డప్పు చప్పుళ్లతో ఊరి పొలిమేర దాటించి వస్తారు. దీనితో గ్రామానికి పట్టిన పీడ వదిలిపోతుందని, పంటలు బాగా పండుతాయని గ్రామస్తుల నమ్మకం.

మాదిగ అడ్వకేట్స్ అలాయ్ బలాయ్ సభను విజయవంతం చేయండి!

- మాదిగ ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరుకావాలి..

- హనుమకొండ జిల్లా మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి మధుకర్..

హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి/ నవంబర్ 05/అక్షరం న్యూస్:-

ఈ నెల 7వ తేదీ శనివారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ చౌరస్తా సమీపంలో ఉన్న విశ్వేశ్వరయ్య భవనంలో నిర్వహించనున్న మాదిగ అడ్వకేట్స్ 'అలాయ్ బలాయ్' సభను విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి మధుకర్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ మాదిగ ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.న్యాయవ్యవస్థలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ) స్టాండింగ్ కౌన్సిల్ వంటి కీలక పదవుల నియామకాల్లో మాదిగ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో సామాజిక న్యాయం సాధించాలంటే సామాజిక ఉద్యమాల ద్వారా హక్కుల కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మాదిగ న్యాయవాదుల ఐక్యత సామాజిక హక్కుల సాధన న్యాయ నియామకాల్లో సముచిత ప్రాతినిధ్యం వంటి అంశాలపై ఈ సభలో చర్చించనున్నట్లు తెలిపారు. కావున మాదిగ ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, సామాజిక ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని తాళ్లపల్లి మధుకర్ కోరారు.

విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా అల్పాహార పథకం

- జడ్పీ సీఈఓ శేషాద్రి, డీఈఓ గిరిరాజు చేతుల మీదుగా ప్రారంభం..

- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ ఉద్దేశం..

- జడ్పీ సీఈఓ శేషాద్రి, డీఈఓ గిరి రాజు...

హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి/ నవంబర్ 05

అక్షరం న్యూస్:-

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహార పథకాన్ని గురువారం భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన హనుమకొండ జిల్లా జడ్పీ సీఈఓ శేషాద్రి, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) గిరిరాజు అల్పాహార పథకాన్ని ప్రారంభించి విద్యార్థులకు అల్పాహారం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. విద్యార్థులు ఉదయం పాఠశాలకు వచ్చే సమయంలో ఆకలితో ఉండకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఉత్సాహంగా చదువుపై దృష్టి సారించే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు నాణ్యమైన ఆహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో అల్పాహార



పంపిణీని క్రమం తప్పకుండా నిర్వహించడంతోపాటు ఆహార నాణ్యత విషయంలో ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు విద్యార్థుల హాజరు శాతం పెరగడంతోపాటు చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వీరేశం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మురసు తుపాన్ బీభత్సం

- అత్యవసర వేళల్లోనూ కదలలేని దుస్థితిలో గ్రామస్థులు

- వంతెన పునర్నిర్మాణానికి, ప్రత్యామ్నాయ మార్గం కొట్టుకుపోయిన ఘటనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి/ నవంబర్ 5/

అక్షరం న్యూస్:

ములకలపల్లి మండలంలో మురసు తుపాన్ తీవ్ర విధ్వంసం సృష్టించింది. తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండగా, మూకమామిడి గ్రామపంచాయతీ పరిధిలోని మొగరాలగుప్ప గ్రామ ప్రజలు బయటి ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు కోల్పోయారు.

వరద ఉధృతికి కుప్పకూలిన వంతెన

మూకమామిడి ప్రాజెక్టు నుంచి భారీగా వచ్చి చేరిన వరద నీటితో స్థానిక వాగు ఉగ్రరూపం దాల్చింది. ఈ తీవ్రమైన వరద ప్రవాహానికి మొగరాలగుప్ప – మూకమామిడి గ్రామాల మధ్య రాకపోకల కోసం నిర్మించిన వంతెన పూర్తిగా దెబ్బతిని కుప్పకూలిపోయింది. వాస్తవానికి ఈ వంతెన ఎత్తు తక్కువగా ఉండటం, పైనుంచి వరద ప్రవాహంలో కొట్టుకొచ్చిన భారీ చెట్లు, వృక్షాలు వంతెనకు అడ్డుగా నిలవడం వల్ల కోతకు గురై కూలిపోయినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసర వేళల్లోనూ నరకయాతన

వంతెన కూలిపోవడంతో మొగరాలగుప్ప గ్రామం నుంచి ములకలపల్లి మండల కేంద్రానికి రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. గ్రామంలో ఎవరికైనా తీవ్ర అనారోగ్యం సంభవించినా, అత్యవసర వైద్య సేవలు అవసరమైనా, ఇతర ఆపత్కాల పరిస్థితులు ఎదురైనా బయటకు వెళ్లేందుకు ఎలాంటి మార్గలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులకు, ఎమ్మెల్యేకు విజ్ఞప్తి

గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఈ విపత్కర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గారు వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రాకపోకల కోసం తక్షణమే ఒక ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన నూతన వంతెన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని మొగరాలగుప్ప గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు సహాయం లేదా అత్యవసర స్పందన కోసం స్థానిక రెవెన్యూ మరియు పంచాయతీరాజ్ అధికారులు మొగరాలగుప్ప ప్రజల సమస్యపై దృష్టి సారించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అంగన్వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యాన్ బహూకరించిన సర్పంచ్

ఓదెల /నవంబర్.05(అక్షరం న్యూస్)

ఓదెల, మండలం పిట్టల ఎల్లయ్యపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి గ్రామ సర్పంచ్ పిట్టల రవికుమార్ ముదిరాజ్ సీలింగ్ ఫ్యాన్‌ను బహూకరించారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో తనవంతు సహాయంగా ఫ్యాన్‌ను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి, చిన్నారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. చిన్నారుల సౌకర్యం కోసం ఫ్యాన్ అందజేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ మౌనిక తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు



అక్షింతలు వేసి నూతన వధూవరులకు ఆశీస్సులు అందజేసిన పలువురు ప్రముఖులు

ఖమ్మం/ టౌన్ నవంబర్ 5 (అక్షరం న్యూస్)

నూతన వధూవరులు వెంకటత్రిలేజి -- కరుణాకర్ వివాహ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరై అక్షింతలు వేసి నూతన దంపతులకు తమ హృదయపూర్వక ఆశీస్సులు అందజేశారు.పోనుగోటి లక్ష్మణ -- శైలజ(లెటు) దంపతుల ప్రథమ పుత్రిక వెంకటత్రిలేజి వివాహం, సుజాతానగర్ మండలం రాఘవపురం గ్రామానికి చెందిన బలరాం -- ఉమా దంపతుల ప్రథమ పుత్రుడు కరుణాకర్‌తో గురువారం పాల్వంచ మండలం పెద్దమ్మ గుడి సమీపంలోని శ్రీ సాయి మార్గ ఏసీ ఫంక్షన్ హాల్‌లో వైభవంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం శివాయిగూడెం మాజీ సర్పంచ్ చెరుకూరి ప్రదీప్ గారి కుటుంబ సభ్యులు25000 ఆశీదజేశారు , రామయ్య కుటుంబ సభ్యులు, శ్రీనివాసరావు అలాగే ఉపసర్పంచ్ లాలు, భార్గవ్, సురేష్, రాందాస్ తదితరులు వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులకు అక్షింతలు వేసి ఆశీస్సులు అందజేశారు. వధూవరుల తల్లిదండ్రులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



విద్యార్థులకు అల్పాహార పథకం ప్రారంభం

- కొప్పూర్‌లో ప్రారంభించిన గ్రామ సర్పంచ్ గద్ద కుమారస్వామి

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ నవంబర్ 05/అక్షరం న్యూస్:-

మండలంలోని కొప్పూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన అల్పాహార పథకాన్ని గ్రామ సర్పంచ్ గద్ద కుమారస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యానికి చదువుపై ఆసక్తికి తోడ్పాటు అందించినట్లవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మిర్యాల రాణి రాజు, వార్డు సభ్యులు సంగేం శ్రీనివాస్, తూముల చిరంజీవి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మండ సమ్మయ్య, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



క్రైస్తవ యువ మహిళలపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

నేటి కంప్యూటర్ యుగంలో మహిళలపై దాడులు మంచి పరిణామం కాదు

జిల్లా క్రైస్తవ ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు.

ఖమ్మం టౌన్ /నవంబర్ 5 (అక్షరం న్యూస్)

క్రైస్తవ యువ మహిళలపై జరిగిన దాడి హేయమైన చర్యా అని , క్రైస్తవ సంఘ ప్రతినిధులు బుధవారం ఖమ్మంలో సమావేశమై తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాదులోని అల్మాస్గూడ ప్రాంతంలో ఆదివారం ఇద్దరు యువ మహిళలను అసభ్య పదజాలంతో తీవ్రంగా కొట్టినటువంటి సంఘటన ను ఖమ్మం జిల్లా క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ తీవ్రంగా ఖండిస్తూ దాడి చేసిన వ్యక్తిని చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని తీర్మానం చేయడమైనది ఇలాంటి దాడులు భవిష్యత్తులో పునరావృతం కాకుండా వ్యక్తిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మధ్యకాలంలో రాజ్యాంగపరమైన హక్కులను కూడా ఉల్లంఘిస్తూ చట్టాన్ని తమ చేతులకు తీసుకొని దుశ్చర్యలకు పాల్పడుతున్న అల్లరిమోకులను అరికట్టాలని పోలీస్ శాఖ వారిని విజ్ఞప్తి చేశారు.వీధిలో తిరిగిన గృహాలు వెళ్లిన ఎవరినైనా మందలించిన మతోన్మాదులు ఉగ్రవాదుల్లాగా ప్రవర్తించడమనేది శోచనీయం అని అన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి క్రైస్తవ సమాజంతో పాటు మానవీయ దృక్పథంతో అన్ని సంఘాల వాళ్ళు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఖండిస్తూ ఇలాంటి వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. ముఖ్యంగా తుంపాల కృష్ణమోహన్ అధ్యక్షతన వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ బాబు అధ్వర్యంలో ప్రింటింగ్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సాక్షిగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి క్రిస్టియన్ జాయింట్ ఆక్షన్ కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నము జిల్లా ఫీజు కమిటీ చైర్మన్, అధికార ప్రతినిధి తిమోతి , జిల్లా కార్పొరేషన్ కన్వీనర్ మాచర్ల శేఖర్ బాబు , జిల్లా నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సంతోష్ , సమన్వయకర్తలు ఎర్నెస్ట్ పాల్ , నందిపేట అభిషేక్ , ముఖ్య సలహాదారు నూతన్ కుమార్ నియోజకవర్గ అధ్యక్షులు అంతోటి జగన్, ఖమ్మం ప్రశాంత్ అత్యవసర సమావేశం నిర్వహించి తీవ్రంగా ఖండించారు.



ఎస్.బి.ఐ.టి. విద్యార్థినికి రూ.9.6 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం

ఖమ్మం/ టౌన్ నవంబర్ 5 (అక్షరం న్యూస్)

తమ కళాశాలకు చెందిన ఈ.సి.ఈ. చివరి సంవత్సర విద్యార్థిని కేశమోని నందిని ప్రముఖ సి.ఏ.డీ, సి.ఏ.ఈ సంస్థ ఎల్లేషన్ నందు ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. గురువారం సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో తమ కళాశాల విద్యార్థిని కంప్యూటర్ ఎయిడెడ్ ఇంజినీర్ (సి. ఏ.ఈ) ప్రాజెక్ట్ ఇంజినీర్ గా ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినిని కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగం అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక పరిజ్ఞానం ఉద్యోగావకాశాలపై ప్రత్యేక శిక్షణ అందించడం వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డా" జి.ధాత్రి పేర్కొన్నారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థల్లో ఉన్నత వేతనాలతో ఉద్యోగాలు సాధించేలా తాము నిరంతరం కృషి చేస్తామని కళాశాల వైస్ చైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. పూణే కేంద్రంగా నిర్వహించబడుతూ 2015 నుండి కంప్యూటర్ ఎయిడెడ్ ఇంజనీరింగ్ (సి.ఏ.ఈ) ,కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్(సి.ఏ.డి) నందు సేవలను అందిస్తున్న ఎలేషన్ సంస్థలో తమ విద్యార్థిని ఎంపికవడం హర్షించదగ్గ విషయం అని కళాశాల ప్రిన్సిపాల్ డా"జి.రాజా కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని నందిని కు వార్షిక ఆదాయం గా 9.60 లక్షలు అందుకోనుందని తెలిపారు. శాశ్వత వర్క్ ఫ్రమ్ హోమ్ గా తను సంస్థకు సేవలు అందిస్తుందని తెలిపారు.ఎంపికైన విద్యార్థిని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా" ఎ.వి.వి. శివ ప్రసాద్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్నది డైవర్షన్ రోడ్డు - వాహనాల రాకపోకలు ఇబ్బంది

భారీ వర్షానికి తెగిపోయిన తాత్కాలిక రహదారి

ముసలిమడుగు వెళ్లే ప్రజలు వేరే మార్గంలో వెళ్లాలని విజ్ఞప్తి

ఖమ్మం/వైరా నవంబర్ 5 (అక్షరం న్యూస్)

వైరా మండలం స్థానాల లక్ష్మీపురం – ముసలిమడుగు గ్రామాల మధ్య బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు భారీ వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక డైవర్షన్ రోడ్డు వర్షపు నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. కాలువలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగి రోడ్డు కింద మట్టిని కోసివేసింది. దీంతో రోడ్డు పక్కన భూమి కుంగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. రోడ్డులో సగం భాగం తెగిపోయి ప్రమాదకరంగా మారింది.ఈ డైవర్షన్ రోడ్డు మీదుగా ప్రతిరోజు వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు, వాహనదారులు ఈ మార్గాన్నే వినియోగిస్తుంటారు. రోడ్డు దెబ్బతినడంతో వారందరూ తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారుప్రస్తుతం ఈ మార్గం ప్రమాదకరంగా మారినందున ఈ మార్గంలో ప్రయాణం చేయవద్దని, ముసలిమడుగు వెళ్లే ప్రజలంతా గమనించి వేరే మార్గంలో వెళ్లాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ మార్గంలో వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డైవర్షన్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని అలాగే బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మున్సిపాలిటీ చైర్ పర్సన్ మాధవి దంపతులకు ఘన సన్మానం..

సన్మానించిన దొడ్డా శ్రీనివాసరావు, కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ)..

ఖమ్మం/ తల్లాడ నవంబర్ 5 (అక్షరం న్యూస్)

తిరువూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన మున్సిపాలిటీ చైర్ పర్సన్ పసుపులేటి మాధవి దంపతులను ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారు గూడెం గ్రామానికి చెందిన నాయకులు సన్మానించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న ఆమెకు తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు(కెవి) శుభాకాంక్షలు తెలిపి ఆ దంపతులను శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నం కృష్ణయ్య, గుమ్మా నరేష్ , దారా కృష్ణ తదితరులు ఉన్నారు.



నేను నాటిన మొక్కలు చూడటానికి వచ్చా..
మొక్కలను చూసి మురిసిపోయిన..
మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకటపుల్లయ్య

ఖమ్మం/సత్తుపల్లి నవంబర్ 5 (అక్షరం న్యూస్)

సత్తుపల్లి: మొక్కలను నాటడమే కాదు, వాటిని పెంచి పెద్దవిగా చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉందని నిరూపిస్తున్నారు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య. 2020 నుంచి 2024 వరకు సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్గా పనిచేసిన ఆయన ప్రస్తుతం భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహిస్తున్నారు. వృక్షో రక్షతి రక్షితః (వృక్షాలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి) అనే నినాదంతో హరిత దీక్ష చేపట్టిన ఆయనకు మొక్కలంటే ఎంతో ప్రేమ. సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా అక్కడ మొక్కలు నాటడమే తన బాధ్యతగా భావించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కోర్టు, పోలీస్ స్టేషన్లు ఇలా అనేక ప్రాంగణాల్లో రకాల మొక్కలు నాటారు. తన కార్యాలయానికి వచ్చే ప్రజలకు మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించడమే కాకుండా, వారికి స్వయంగా మొక్కలను అందించి వాటిని పెంచాలని ప్రోత్సహించేవారు. ఈ విధంగా సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, వేంసూర్ తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు తన వంతు కృషి చేశారు.ప్రస్తుతం భద్రాద్రి ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ సత్తుపల్లిలో తాను నాటిన మొక్కలపై ఆయనకు ఉన్న మమకారం మాత్రం తగ్గలేదు. గురువారం సత్తుపల్లికి వచ్చిన ఆయన, గతంలో తాను మొక్కలు నాటిన పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి వాటి ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు. కొన్ని మొక్కలు ఎండిపోయి కనిపించగా బాధపడ్డారు. మరికొన్ని వృక్షాలుగా ఎదగడం చూసి ఆనందం వ్యక్తం చేశారు. తాను నాటిన మొక్కలను ఆప్యాయంగా స్పృసించారు. సత్తుపల్లి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సంఘ అధ్యక్షులు పసుపులేటి నాగేశ్వరరావు ఈ సందర్భంగా ఆయన సేవలను అభినందిస్తూ శాలువా, పుస్పగుచంతో అభినందించారు.



మీ ధైర్యం.. సమయస్ఫూర్తికి అభినందనలు

ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ధైర్యసాహసాలకు మంత్రి పొంగులేటి అభినందన..
ప్రాణనష్టం జరగకుండా సహాయక చర్యలు.. చేపట్టిన అధికారులకు కితాబు..
కలెక్టర్లు, పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయ కృషిపై ప్రశంసలు..
సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, మత్స్యకారులకు పరామర్శ..
సొంత ఇల్లు లేని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ.

ఖమ్మం/సత్తుపల్లి నవంబర్ 5 (అక్షరం న్యూస్)

సత్తుపల్లి: మురసు తుపాను ప్రభావంతో బేతుపల్లి చెరువు అలుగు పొంగి వరద ఉద్ధృతి పెరిగిన వేళ.. ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ధైర్యసాహసాలు అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణనష్టం జరగకుండా బాధితులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన కలెక్టర్లు, పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. బుధవారం రాత్రి బేతుపల్లి చెరువు వద్ద వరదలో చిక్కుకున్న మత్స్యకారులను రక్షించే క్రమంలో పడవ బోల్తాపడి 11 మంది వరద ఉద్ధృతిలో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఖమ్మం కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీతో పాటు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు తీవ్రంగా శ్రమించి అందరినీ సురక్షితంగా బయటకు తీసుకురావడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు.చాతకొండ ఆరో బెటాలియన్, ఫైర్ సిబ్బందికి పరామర్శ..సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని మంత్రి పొంగులేటి గురువారం పరామర్శించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు దివాకర టీఎస్, అంకిత్‌లతో కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.చాతకొండ ఆరో బెటాలియన్‌కు చెందిన ఆర్ఎస్ఐ మురళి, హెడ్ కానిస్టేబుల్ నరేష్, కానిస్టేబుళ్లు వేణు, బాలాజీ, సీతయ్య, కాశీరాంతో పాటు అగ్నిమాపక శాఖ సిబ్బంది ఎస్.కే. యాసిన్ అజ్వల్, ఎన్. రాజా, నాజర్ వలీ, రామిరెడ్డిలను పరామర్శించారు. రాత్రంతా వరద ఉద్ధృతిలో చిక్కుకున్నప్పటికీ ధైర్యం కోల్పోకుండా సహాయక చర్యల్లో పాల్గొన్న తీరు గొప్పదని ప్రశంసించారు. ఈ సందర్భంగా సిబ్బందికి శాలువాలు కప్పి సత్కరించి, పండ్లు అందజేశారు.





ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు..

బుధవారం రాత్రే ఈ ఘటనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేందుకు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేశారని ప్రశంసించారు. ఉదయం హెలికాప్టర్ ద్వారా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని భావించినప్పటికీ.. అధికారుల సమర్థవంతమైన చర్యలతో ఆ అవసరం లేకుండానే అందరినీ ఒడ్డుకు చేర్చగలిగారని పేర్కొన్నారు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో తాను సైతం వరదలో చిక్కుకున్న వారితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పినట్లు గుర్తుచేశారు. విధి నిర్వహణలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిలో సొంత ఇల్లు లేని వారు ఎవరైనా ఉంటే.. వారు ఏ జిల్లాకు చెందిన వారైనా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆపత్కాలంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి వ్యక్తిగతంగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు లో వైరా అగ్రస్థానం.. ఆర్ జె సి కృష్ణ..
తుఫాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి...

ఖమ్మం/వైరా టౌన్ నవంబర్ 5 (అక్షరం న్యూస్)



వైరా: ఖమ్మం నల్గొండ వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా వైరా నియోజవర్గం జిల్లాలోని అగ్రస్థానంలో ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారని వైరా నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక నియోజకవర్గ ఇన్చార్జ్ ఆర్ జె సి కృష్ణ అన్నారు.. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఆర్నబ్ మురుసు తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు తక్షణమే పంట నష్ట పరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. వైరా నియోజకవర్గంలో 11000 గ్రాడ్యుయేట్ ఓట్లు ఉండగా టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సుమారు ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఓటు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేశామని ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు నిరుద్యోగులు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఓటు నమోదుకు విద్యావంతులు ఆసక్తి చూపటం లేదని అయినప్పటికీ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఓటు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి నాయకులు కార్యకర్తలు ఆయా గ్రామాల్లో పట్టణాల్లో విద్యావంతుల వద్దకు వెళ్లి ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్క కార్యకర్త ఎమ్మెల్సీ ఎన్నిక గెలిపే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు... ఈ సమావేశంలో సీనియర్ నాయకులు కట్ట కృష్ణార్జున రావు బాణాల వెంకటేశ్వరరావు వనమా విశ్వేశ్వరరావు భూమాత కృష్ణమూర్తి మద్దెల రవితిరుపతి శ్రీను. మిట్టపల్లి సత్యం బాబు వజినేపల్లి చక్రవర్తి మిట్టపల్లి కిరణ్ నూకల వాసు వేల్పుల నారాయణ సింగవరపు నరేష్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా వైరాలో మున్సిపల్
వైస్ చైర్మన్ కట్ల సంతోష్ జన్మదిన వేడుకలు..

ఖమ్మం/ వైరా టౌన్ నవంబర్ 5 (అక్షరం న్యూస్)

వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ జన్మదిన వేడుకలను వైరాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్నేహితులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కట్ల సంతోష్ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసేందుకు భగవంతుడు తనకు మంచి ఆరోగ్యం, ఆయుష్షు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజాక్షేత్రంలో ప్రజల మధ్య ఉంటూ, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజాసేవే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి కిరణ్, పోలూరు సైదులు, కట్ల ప్రసాద్, సమీర్, రవి, వాసు, ముదిగొండ మహేష్, ముదిగొండ సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మురసు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎంపీ రఘురామ్ రెడ్డి, ఎమ్మెల్యే జారె విస్తృత పర్యటన

వరదలతో దెబ్బతిన్న ఇళ్లు, పంట పొలాలు, రహదారులు, చెరువుల పరిశీలన
బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది.. నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటాం

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / నవంబర్ 05 / అక్షరం న్యూస్

:మురసు తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేట మండలంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరద ప్రవాహం కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబుతో కలిసి విస్తృతంగా పర్యటించారు. వరదలతో దెబ్బతిన్న ఇళ్లు, పంట పొలాలు, రహదారులు, చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధిత ప్రజలు, రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రకృతి విపత్తు కారణంగా నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

వరద నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలన

వరద నీటి ఉధృతికి దెబ్బతిన్న ఇళ్లు, పంట పొలాలు, రహదారులు, చెరువులను ఎంపీ, ఎమ్మెల్యే పరిశీలించారు. వరదల కారణంగా ప్రజలకు జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పంటలు దెబ్బతిన్న రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.

నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి

ప్రకృతి విపత్తుల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని ఎంపీ, ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. వరదల వల్ల నష్టపోయిన బాధితులందరికీ న్యాయం జరిగేలా అధికారులు సమగ్రంగా నష్టాన్ని అంచనా వేయాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన బాధితులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

దెబ్బతిన్న రహదారులకు తక్షణ మరమ్మతులు

వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టి ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. చెరువులు, కాలువలు, నీటి ప్రవాహ మార్గాలను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూడాలి

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు, విద్యుత్, వైద్యం వంటి అత్యవసర సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యే సూచించారు. ప్రజా జీవనం యథావిధిగా కొనసాగించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన చోట తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



రైతులకు అండగా ఉంటాం.. నష్టపోకుండా చర్యలు

ముఖ్యంగా రైతులు నష్టపోకుండా వారికి ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందించేందుకు కృషి చేస్తామని ఎంపీ, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి అర్హులైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బాధిత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, మండల వైస్ ప్రెసిడెంట్ జల్లిపల్లి దేవరాజు, జూపల్లి ప్రమోద్, డీసీసీ మెంబర్ తుమ్మరాంబాబు, కౌన్సిలర్లు దేరంగుల ప్రసాద్, మింద హరిబాబు, దగ్గుమెల్ల నరేంద్ర, కొట్టే సునీత అనిల్, సూరనేని ఫణి, కొట్టే శ్రీను, దండబత్తుల నరేష్, బూసి పాండు, నంద్రు రమేష్, కర్ణాటఖ శ్రీను, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు
జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్...

- **ముందస్తు అనుమతులు లేకుండా ప్రజా బహిరంగ కార్యక్రమాలు, సభలు, ర్యాలీలు నిషేధం.**
- **నవంబర్ 30వ తేదీ వరకు నిబంధనలు వర్తిస్తాయి**
- **నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు.**

సూర్యాపేట టౌన్ నవంబర్ 05 అక్షరం న్యూస్

శాంతి భద్రతల పరిరక్షణ దృశ్య, జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా, జిల్లాలో ఉన్న ప్రశాంత వాతావరణం భంగం కాకుండా, సవ్యంగా కొనసాగించడానికి ఈనెల 30 తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారు తెలియజేశారు.



ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆ పై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమి గుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని మరియు సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలను ఉసిగొలిపేటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది దారి తీసే ప్రజా సమావేశాలు, జన సమూహం లాంటివి పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డీజేలు వంటివి వాటికి అనుమతులు లేవని తెలిపారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని సూచించారు. చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలకు తప్పవు అని సూచించారు. నిబంధనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులను పొందాలని సూచించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- **పాత బస్టాండ్ వద్ద ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు.**
- **బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్**



మంచిర్యాల జిల్లా/మందమర్రి, నవంబర్ 5/ అక్షరం న్యూస్ –:

బెల్లంపల్లి సబ్ డివిజన్ ఏసీపీ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మందమర్రి పాత బస్టాండ్ ప్రాంతంలో గురువారం సాయంత్రం పోలీసులు అకస్మాత్తుగా ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బెల్లంపల్లి సబ్ డివిజనల్ ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ పర్స రమేష్, ఎస్ఐ గోపతి నరేష్ లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, వారి వాహనాలను సీజ్ చేశారు. సరియైన పత్రాలు లేకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం వంటి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 43 వాహనదారులపై ఈ-చెలాన్లు విధించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని, ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించారు.

నందనం రెస్టారెంట్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

- **ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతపై పరిశీలన**



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 5 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డులోని నందనం రెస్టారెంట్ (విశ్వనాథ్ హోటల్)లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అరవింద్ రెడ్డి తనిఖీలు నిర్వహించారు. రెస్టారెంట్‌లో ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాలకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. వినియోగదారులకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత హోటళ్ల యాజమాన్యాలపై ఉందని ఈ తనిఖీలు గుర్తుచేస్తున్నాయి. ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత పాటించడం, నాణ్యమైన ముడి సరుకులు వినియోగించడం, ఆహార పదార్థాలను సక్రమంగా నిల్వ చేయడం వంటి అంశాలు ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైనవి. అయితే తనిఖీల్లో ఏయే లోపాలు గుర్తించారు, హోటల్ యాజమాన్యానికి ఏవైనా సూచనలు లేదా హెచ్చరికలు జారీ చేశారా అనే వివరాలు తెలియాల్సి ఉంది. ఎన్టిపిసి ఏరియాలోని పలు రెస్టారెంట్లలో కస్టమర్ల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. సరైన కిచెన్ నిర్వహణ లేదని, నిన్న మొన్నటి మాంసం విక్రయిస్తున్నారని తరచుగా ఇలాంటి దాడులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా పకడ్బందీ చర్యలు

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**
- **వాటర్ స్టైస్ గ్రామాలను నవంబర్‌లోనే గుర్తించి సమస్యలు పరిష్కరించాలి**
- **హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు 15 రోజుల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు.. వారం రోజుల్లో గ్రామాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి**

సూర్యాపేట టౌన్ నవంబర్ :05 అక్షరం న్యూస్

జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గ్రామాలను గుర్తించి నవంబర్ నెలలోనే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. తాగునీటి సరఫరాతో పాటు నీటి శుద్ధి, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాలు, ఆవాసాల వారీగా తాగునీటి పరిస్థితిని అంచనా వేసి గ్రీన్, ఎల్లో, రెడ్ కేటగిరీలుగా విభజించాలని తెలిపారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా తాగునీటి సరఫరా పరిస్థితిపై ప్రత్యేక ప్రొఫార్మా ద్వారా వివరాలు సేకరించినట్లు కలెక్టర్ తెలిపారు. మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా వ్యవస్థల ద్వారా నీటి సరఫరా, స్థానిక నీటి వనరుల పరిస్థితిని అంచనా వేయాలన్నారు. నీటి సమస్యలు లేని ప్రాంతాలు, కొంత ఇబ్బంది ఉన్న ప్రాంతాలు, తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. మండలాలు, గ్రామాల వారీగా అవసరమైన పనులు, వాటి అంచనా వ్యయాలతో కూడిన నివేదికను వారం రోజుల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు.

హాస్టళ్లకు 15 రోజుల్లో నీళ్లులిలి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలకు 15 రోజుల్లోగా మిషన్ భగీరథ కనెక్షన్లు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కనెక్షన్లు లేని సంస్థలకు ప్రత్యామ్నాయంగా నీటి సరఫరా కల్పించాలని, అవసరమైతే సంపులు, సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా తాగునీరు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.



నీటి వృథాపై నివేదిక ఇవ్వాలి

మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీటిలో సుమారు 20 నుంచి 25 శాతం వరకు వృథా అవుతున్నట్లు తన పరిశీలనలో గుర్తించానని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అంచనాపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవ పరిస్థితిని వారం రోజుల్లో నివేదించాలని అధికారులను కోరారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి పైపులైన్ల ద్వారా నీరు వృథాగా డ్రైనేజీల్లోకి వెళ్తున్న ప్రాంతాలను గుర్తించి లీకేజీలను అరికట్టాలన్నారు.

ప్రతి గ్రామంలో ట్యాంకర్ సిద్ధంగా ఉండాలి

అత్యవసర పరిస్థితుల్లో నీటి సరఫరాకు ప్రతి గ్రామ పంచాయతీలో ట్రాక్టర్, ట్యాంకర్ అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. పనిచేయని ట్యాంకర్లు, ట్రాక్టర్లను వెంటనే మరమ్మతు చేయించాలని, అవసరమైతే అద్దెకు తీసుకోవడానికి కూడా కారణాలు స్పష్టంగా తెలియజేయాలన్నారు. అవసరమైన గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

భూగర్భ జలాలపై 15 రోజులకోసారి నివేదిక

భూగర్భ జలాల పరిస్థితిపై ప్రతి 15 రోజులకు ఒకసారి నివేదిక ఇవ్వాలని గ్రౌండ్ వాటర్ అధికారులను ఆదేశించారు. నీటి వనరుల లభ్యత, బోర్‌వెల్ల పరిస్థితి, అవసరమైన మరమ్మతులపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ప్రభుత్వ భవనం వద్ద రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, బోర్‌వెల్లకు రీచార్జ్ నిర్మాణాలు, కమ్యూనిటీ సోక్‌పిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఈ పనులు చేపట్టాలన్నారు.

వారానికోసారి సమీక్ష

మిషన్ భగీరథ, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, గ్రౌండ్ వాటర్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ సరఫరా అంతరాయాల వల్ల నీటి పంపింగ్ నిలిచిపోకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రతి వారం సమావేశమై సమస్యలు, పరిష్కారాలపై సమీక్షించాలని తెలిపారు. నీటి పొదుపుపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, బోర్‌వెల్ల తవ్వకాల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, డిఆర్డిఓ పిడి సన్యాసయ, జడ్పీ సీఈవో శిరీష, డిపిఓ యాదగిరి, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్ రెడ్డి, డిడబ్ల్యూఓ నరసింహారావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు,

సింగరేణి ఫుట్‌బాల్ పోటీల్లో ఆర్జీ-1, 2 సంయుక్త జట్టుకు విజయం

- **రన్నరప్‌గా మందమర్రి, బెల్లంపల్లి జట్టు**

జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 5 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు ఉత్సాహభరితంగా సాగిన సింగరేణి కంపెనీ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో ఆర్జీ-1, ఆర్జీ-2 సంయుక్త జట్టు విజేతగా నిలవగా, మందమర్రి, బెల్లంపల్లి సంయుక్త జట్టు రన్నరప్‌గా నిలిచింది. సింగరేణి క్రీడా విభాగం (డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో సంస్థ పరిధిలోని 11 ఏరియాల జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ పోటీలో విజేతగా నిలిచిన ఆర్జీ-1, 2 సంయుక్త జట్టుతో పాటు రన్నరప్ జట్టుకు ముగింపు వేడుకల్లో రామగుండం ఏరియా-1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. సింగరేణిలోని 40 వేల మంది ఉద్యోగులకు ప్రతినిధులుగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. సంస్థ సీఎండీ బుద్ధప్రకాష్, డైరెక్టర్ గౌతం పొట్రు క్రీడలను ప్రోత్సహిస్తూ అవసరమైన నిధులు, వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. విధుల్లో చూపే నిబద్ధతను క్రీడల్లోనూ ప్రదర్శించాలని, ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి కోల్ ఇండియా పోటీల్లో పాల్గొని సింగరేణి కీర్తిని చాటాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్, క్వాలిటీ జీఎం వెంకటరమణ, సేఫ్టీ జీఎం మల్లయ్య, రెస్క్యూ జీఎం శ్రీనివాస్ రెడ్డి, ఎస్వో టు జీఎం చంద్రశేఖర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీనివాస్, ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు క్రాంతి కుమార్, మల్లేష్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, క్రీడా గౌరవ కార్యదర్శి హనుమంతరావు, సేవా ప్రతినిధులు బీనాసింగ్, రజిత, మణి, భాస్కరి, లేడీస్ క్లబ్ కార్యదర్శి శిరీష, అధికారులు చిలుక శ్రీనివాస్, వరప్రసాద్, జితేందర్ సింగ్, క్రీడా పర్యవేక్షకులు నరేందర్ రెడ్డి, అశోక్, శ్రీనివాస్, పోసనెట్ గాండ్ల రాజయ్య, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ రిఫరీలు విజయ్‌కుమార్, రేవంత్, వంశీ, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత భారత్ యూత్ పార్లమెంట్‌లో యువతకు నాయకత్వ పాఠాలు

- **ఒకే దేశం.. ఒకే ఎన్నిక అంశంపై జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు**

జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 5 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :

యువత విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని అన్ని రంగాల్లో రాణించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి సూచించారు. యువత రాజకీయాల్లోకి వచ్చి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గోదావరిఖనిలోని స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వికసిత భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అనే అంశంపై పెద్దపల్లి జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా యువజన అధికారి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. మై భారత్ సంస్థ ద్వారా యువతలో నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పీజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వై. ప్రసాద్ మాట్లాడుతూ యూత్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు యువతకు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు చక్కటి వేదికలని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విజయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ చెరుకురవి మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో యూనివర్సిటీ పీజీ కళాశాలకు చెందిన విద్యార్థి మొదటి స్థానాన్ని, జేఎన్‌టీయూ మంథనికి చెందిన శివసాయి రెండో స్థానాన్ని, గాయత్రి డిగ్రీ కళాశాలకు చెందిన హరిప్రియ మూడో స్థానాన్ని సాధించారు. విజేతలైన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న వికసిత భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, మై భారత్ ప్రోగ్రాం అధికారి కిరణ్, పీజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వై. ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ చెరుకురవి, డాక్టర్ సుధ, డాక్టర్ అంబిక, డాక్టర్ రఘుపతి, శ్యాంప్రసాద్, జ్యోతి, డాక్టర్ సతీష్, ఉదయ్ కిరణ్, రవీందర్, డాక్టర్ ఉపేందర్, వివిధ కళాశాలల విద్యార్థులు, ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.



పిటి స్వామి సేవలు స్ఫూర్తిదాయకం

- మరణానంతరం ఇద్దరికి చూపునిచ్చిన నేత్రాలు
- కుటుంబ సభ్యుల నిర్ణయం అభినందనీయం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జ్యోతి నగర్ ఎన్టిపిసి నవంబర్ 5 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

విద్య, సామాజిక సేవతోపాటు రాజకీయ, కార్మిక రంగాల్లో పీటీ స్వామి అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సమాజ హితం కోసం జీవితాంతం కృషి చేసిన ఆయన.. మరణానంతరం కూడా తన నేత్రాలను దానం చేసి మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. పీటీ స్వామి ఇటీవల మృతి చెందగా, విషాదంలోనూ ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం గోదావరిఖనిలోని దుర్గానగర్ ఆర్కే గార్డెన్స్‌లో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి పీటీ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు...



అనంతరం పీటీ స్వామి కుటుంబ సభ్యులు పీ.ఎస్.అమరేందర్ తోపాటు కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ తరఫున అందజేసిన అభినందన పత్రాన్ని కొప్పుల ఈశ్వర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతికున్నంత కాలం ప్రజల కోసం, సమాజ అభ్యున్నతి కోసం పరితపించిన పీటీ స్వామి.. మరణం తర్వాత కూడా తన నేత్రదానంతో ఇద్దరికి చూపునిచ్చి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. తండ్రి చివరి కోరికకు అనుగుణంగా నేత్రదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులను కొప్పుల ఈశ్వర్, కోరుకంటి చందర్ అభినందించారు.

ఆలోచింపజేసిన నేత్రదానంపై అవగాహన...

సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింమూర్తి నేత్ర, అవయవ, శరీరదానాల ప్రాముఖ్యతను వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఆరెపల్లి రాజమౌళి, కేఎస్ వాసు, నూతి సురేష్ కుమార్, జీవన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- అభివృద్ధికి నోచుకోని కాలనీపై సీపీఎం ఆవేదన

జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 5 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : ఎన్టీపీసీ 1వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం పార్టీ 1వ డివిజన్ శాఖ కార్యదర్శి గిట్ల లక్ష్మారెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం డివిజన్ బృందం కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించింది.ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాలనీ ఏర్పడి 20 ఏళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయి అభివృద్ధికి నోచుకోకపోవడం విచారకరమన్నారు. ముఖ్యంగా ఆలయం ముందు ఉన్న కింది లైన్లు, మేడిపల్లి సిక్కువాడ సబ్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అంతర్గత రహదారులు, మురుగునీటి కాలువలు, మంచినీటి పైపులైన్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.మురుగునీటి పారుదలకు సరైన వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల పక్కనే గుంతలు తవ్వుకొని వాడుక నీటిని నిల్వ చేయాల్సి వస్తోందన్నారు. అవి నిండిపోయి నీరు రోడ్లపైకి చేరడంతో



వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లడంతో కొంతమేర పనులు చేపట్టినప్పటికీ, సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదన్నారు. కార్పొరేషన్ కమిషనర్, మేయర్, స్థానిక కార్పొరేటర్ స్పందించి కాలనీలో అంతర్గత సిమెంట్ రహదారులు, భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మించాలని, ప్రతి ఇంటికీ ఉచితంగా మంచినీటి కనెక్షన్లు కల్పించాలని కోరారు. సమస్యలను తక్షణమే పరిష్కరించక పోతే కాలనీవాసులను సమీకరించి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సీపీఎం నాయకులు ముదిగంటి కృష్ణారెడ్డి, వాసంపెల్లి శ్రీనివాసరెడ్డి, అక్కపాక శంకర్, కొలిపాక మైపాల్ రెడ్డి, సంతోష్ రెడ్డితో పాటు కాలనీవాసులు ప్రభాకర్, జావీద్, మంగ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని ఒక వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దడానికి ఈ ప్రయత్నాలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి నవంబర్ 5 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దడానికే లక్ష్మీ నగర్ , కళ్యాణ్ నగర్ లపై మొదటగా దృష్టి సారించి సుమారు రూ 35 కోట్ల భారీ నిధులతో ప్రదాన రహదారుల అభివృద్ధి పనులు చేపట్టామని , ఇప్పుడు గల్లీ లను కూడా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు .గురువారం నలభై వ డివిజన్ లోని కళ్యాణ్ నగర్ లో సి సి రోడ్డు నిర్మాణం పనులను డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య . స్థానిక కార్పొరేటర్ కజంపురం జయప్రద రాజేందర్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ్ నగర్ లో యు జి డి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత ప్రభుత్వ హయాంలో ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ నేతృత్వంలో తాము ధర్నా చేయడం జరిగిందని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ పనికి ప్రాధాన్యత నిస్తూ ప్రారంభించడం జరిగిందని అన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతి పక్షాల విమర్శలు తిప్పికొట్టి తమకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాసరి సాంబమూర్తి , గట్ల రమేష్ , వడ్లూరి రవి , నగర పాలక సంస్థ ఎ ఇ తేజస్విని , స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు .

ముగిసిన మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు 400 కిలోమీటర్ల ప్రయాణం

- ఎనిమిది రోజుల పాటు సాగిన యాత్రలో గోదావరిఖనికి చెందిన పది మంది యువకులు
- ఘన స్వాగతం పలికి సత్కరించిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి నవంబర్ 5 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యతను చాటుతూ, వ్యవసాయ రంగం మళ్లీ పచ్చదనంతో కళకళలాడాలనే ఆకాంక్షతో గోదావరిఖనికి చెందిన పది మంది యువకులు చేపట్టిన సైకిల్ యాత్ర విజయవంతంగా ముగిసింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తూ ఈ యాత్ర సాగించారు. మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. ఎనిమిది రోజుల పాటు సుమారు 400 కిలోమీటర్లు ప్రయాణించి తమ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. యాత్ర ముగించుకుని గోదావరిఖనికి చేరుకున్న బృందానికి బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ యువకులను అభినందించి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రౌడీ, హిస్టరీ షీటర్లపై పోలీసుల నిఘా

- మండల వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /05(అక్షరం న్యూస్)

ముస్తాబాద్ మండల పరిధిలోని రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ.. ముస్తాబాద్ మండల వ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లు హిస్టరీ షీటర్ల పై రాత్రి వేళల్లో ఎస్ ఐ జ్యోతి అకాస్మిక తనిఖీ నిర్వహించారు.రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి వారి ప్రస్తుత కార్యకలాపాలు, జీవన విధానం, కదలికలపై ఆరా తీశారు., హిస్టరీ షీటర్లు ప్రస్తుత కార్యకలాపాలు మరియు వారి కదలికలపై ఆరా తీసి నేరాలకు దూరంగా ఉండాలని సత్ప్రవర్తనతో జీవించాలని చెప్పారు .ఈ సందర్భంగా నేర ప్రవృత్తికి దూరంగా ఉంటూ, సత్ప్రవర్తనతో జీవించాలని వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. అలాగే ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై జ్యోతి హెచ్చరించారు .

నిలిచిపోయిన రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

- అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు, విద్యార్థులకు తప్పని ఇబ్బందులు



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 5 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ మల్కాపూర్ ప్రధాన రహదారి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం 3వ డివిజన్ శాఖ కార్యదర్శి దండ రాఘవరెడ్డి డిమాండ్ చేశారు.గురువారం సీపీఎం నాయకుల బృందం డివిజన్ పరిధిలో పర్యటించి నిలిచిపోయిన రోడ్డు పనులను పరిశీలించింది. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ మల్కాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై భూగర్భ మురుగునీటి కాలువ నిర్మాణం పూర్తి చేసినప్పటికీ, సిమెంట్ రోడ్డు పనులను మాత్రం సగం వరకు కంకర వేసి మధ్యలోనే నిలిపివేశారని విమర్శించారు. రామయ్యపల్లె వైపు కూడా కాలువ పైపులైన్లు వేసిన ప్రాంతంలో రోడ్డు గుంతలు, ఎత్తుపల్లాలతో ప్రమాదకరంగా మారిందన్నారు.ఈ మార్గం గుండా మల్కాపూర్, జంగాలపల్లె, రామయ్యపల్లె తదితర గ్రామాల ప్రజలు నిత్యావసరాలు, ఇతర పనుల కోసం గోదావరిఖనికి రాకపోకలు సాగిస్తుంటారని, విద్యార్థులు సైతం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఇదే రహదారిని వినియోగిస్తారని తెలిపారు. కాంట్రాక్టర్ పనులను నత్తనడకన సాగిస్తుండటంతో రోడ్డుపై గుంతలు, పైకి తేలిన కంకర కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని, అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, మేయర్, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తక్షణమే స్పందించి నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయించాలని కోరారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్ పనితీరుపై పర్యవేక్షణ పెంచి, నాణ్యతతో కూడిన పనులను వేగవంతం చేయించాలని డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలోగా ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా గుంతలను పూడ్చి రహదారిని తాత్కాలికంగా ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు.ఈ పర్యటనలో సీపీఎం నాయకులు ఎం. రామాచారి, ఎన్. బిక్షపతి, కె. రాజ్‌కుమార్, ఎండీ షమీం తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు ఐక్యంగా పోరాడాలి

- బీజేపీ, మోడీ ప్రజావ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాలి
- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ పిలుపు



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 5 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : కమ్యూనిస్టు విప్లవోద్యమ అమరవీరుల త్యాగాలు, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని దోపిడీ, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బీజేపీ, మోడీ నాయకత్వంలోని ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక శక్తులన్నీ ఐక్యంగా పోరాడాలని అన్నారు.స్థానిక ఎన్టీపీసీ పార్టీ కార్యాలయంలో గురువారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిస్టు విప్లవోద్యమ అమరవీరుల సంస్మరణ సభకు పార్టీ జిల్లా నాయకురాలు కోడిపుంజుల లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జూపాక శ్రీనివాస్ మాట్లాడుతూ 1967 నక్సల్బరీ ఉద్యమం నుంచి శ్రీకాకుళం, గోదావరి లోయతో పాటు ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో సాగిన విప్లవోద్యమాల్లో ప్రజల విముక్తి, భూమి, భుక్తి, హక్కుల కోసం ఎందరో ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. భూస్వామ్య దోపిడీ, కులవివక్ష, సామాజిక అసమానతలు, పీడనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తూ పోరాటాలు సాగించారని పేర్కొన్నారు.మోడీ నాయకత్వంలోని బీజేపీ పాలనలో ప్రజాస్వామ్య, లౌకిక విలువలు, రాజ్యాంగ హక్కులకు ముప్పు ఏర్పడుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించడం, కార్మిక హక్కులను బలహీనపరిచే చట్టాల మార్పులు, రైతాంగ సమస్యల నిర్లక్ష్యం, నిరుద్యోగం, ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మతం పేరుతో ప్రజల మధ్య విభజన సృష్టించడం, ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం వంటి విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, విద్యార్థులు, యువకులు, మహిళలు విప్లవోద్యమాల్లో కీలక పాత్ర పోషించారని, అనేక నిర్బంధాలు, దాడులను ఎదుర్కొంటూ ప్రజల హక్కుల కోసం పోరాడిన అమరవీరుల ఆశయాలు నేటికీ సజీవంగా ఉన్నాయని పేర్కొన్నారు. వారి త్యాగాలను నేటి తరానికి తెలియజేస్తూ సమసమాజ నిర్మాణం కోసం ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గూడూరి వైకుంఠం, ఈసంపల్లి రాజేందర్, ఆడెపు శంకర్, మార్తా రామన్న, కోడిపుంజుల లక్ష్మి, ధర్మాజీ నరసయ్య, తీగుట్ల రాములు, కలువల రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

వైరా మున్సిపాలిటీ 11వ వార్డులో అధ్వానంగా మారిన రహదారి..

- బురదమయంగా సోమవరం ఎస్సీ కాలనీ దారి..



ఖమ్మం/వైరా టౌన్ నవంబర్ 5(అక్షరం న్యూస్)

వైరా మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు సోమవరం గ్రామం ఎస్సీ కాలనీ (మాలపల్లి)కి వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా బురదమయంగా మారింది. వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోయి, కాలనీకి వెళ్లే మార్గం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితికి చేరింది.దీంతో ఆ మార్గంలో ప్రయాణించే కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాకపోకలకు తీవ్ర విఘాతం కలగడమే కాకుండా, రాత్రివేళల్లో నడవడానికి నరకయాతన అనుభవిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు అంతా గుంతలమయమై బురద పేరుకుపోవడంతో అత్యవసర సమయంలో లేదా ఇతర వాహనాలు కాలనీకి వచ్చే పరిస్థితి లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక ఏళ్లుగా ఈ సమస్య పునరావృతమవుతున్నా, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పట్టించుకోకపోవడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే తాత్కాలికంగా గ్రావెల్ తోలి రాకపోకలను పునరుద్ధరించాలని, అలాగే రోడ్డుకు శాశ్వత సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి తమ రవాణా కష్టాలను తీర్చాలని 11వ వార్డు ఎస్సీ కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ..



ఖమ్మం/తల్లాడ నవంబర్ 5(అక్షరం న్యూస్)

తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం తల్లాడ పట్టణంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు దగ్గుల మోహన్ రెడ్డి, బొడ్డు శ్రీను లకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడ్డు వెంకటేశ్వరరావు (బి.వి.ఆర్), తల్లాడ టౌన్ ప్రెసిడెంట్ భద్రారెడ్డి, మొక్క బసవయ్య, మాజీ జెడ్పిటిసి మూకర ప్రసాదు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లాడ పట్టణంలో అర్హులైన లబ్ధిదారులకు అందరికీ జిల్లా మంత్రుల సహకారంతో సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాగమయి దయానంద్ సహకారంతో ఇందిరమ్మ ఇండ్లు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు,. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. మురుసు తుఫాన్ కారణంగా సత్తుపల్లి బేతుపల్లిలో వరదల కారణంగా చిక్కుకున్న మత్స్యకారులను ఎస్డిఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రాత్రి మొత్తం అక్కడే ఉండి ఆరా తీస్తూ క్షేమంగా తిరిగి రావడంలో కృషిచేసిన జిల్లా మంత్రులకు సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ కి తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యుగంధర్, రామారావు లబ్ధిదారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మురసు తుఫానుతో ములకలపల్లి మండలంలో భారీగా పంట నష్టం

- ములకలపల్లిలో తుఫాను బీభత్సం 2,438 ఎకరాల్లో పంట నష్టం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /ములకలపల్లి /నవంబర్ 5/అక్షరం న్యూస్:

ఇటీవల సంభవించిన తుఫాను, భారీ వర్షాల కారణంగా ములకలపల్లి మండలంలో దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయ అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ప్రాథమిక పంట నష్టాన్ని అంచనా వేశారు. ఈ పరిశీలనలో అశ్వారావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) రవికుమార్, మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) అరుణ్ బాబుతో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) రాహుల్ గాంధీ, రమేష్, సుజాత, సూరిబాబు పాల్గొన్నారు.?మండలవ్యాప్తంగా 12 రెవెన్యూ గ్రామాల పరిధిలో మొత్తం 1,205 మంది రైతులకు సంబంధించి 2,438 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో అత్యధికంగా 1,287 ఎకరాల్లో వరి, 637 ఎకరాల్లో పత్తి, 366 ఎకరాల్లో వేరుశనగ, 81 ఎకరాల్లో మొక్కజొన్న, 54 ఎకరాల్లో మినుముతో పాటు ఇతర పంటలు 13 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ప్రాథమిక నివేదికలో వెల్లడించారు. ప్రధానంగా ములకలపల్లి, చాపరాలపల్లి, పూసుగూడెం, మూకమామిడి, తిమ్మంపేట, పోగలపల్లి, జగన్నాధపురం, కమలాపురం గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో పంటలు నీట మునిగాయి. బాధిత రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించి తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

కేజీ సిరిపురంలోఉపాధి హామీ పనులను పరిశీలించిన.. అదనపు డీఆర్‌డీఓ



ఖమ్మం/ వైరా నవంబర్ 5 (అక్షరం న్యూస్)

వైరా మండలంలోని కేజీ సిరిపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల క్షేత్రస్థాయిని (వర్క్ సైట్స్) అదనపు డీఆర్‌డీఓ (అడిషనల్ డిఆర్డిఏ సందర్శించి, పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల ఆవశ్యకత గురించి మరియు కూలీల హాజరు శాతం పెంచడంపై సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు తో చర్చించారు. గ్రామంలో అర్హులైన కూలీలందరూ పనులకు హాజరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకొని వారిని ప్రోత్సహించాలని సర్పంచ్ ని కోరారు.ఈ కార్యక్రమంలో గఅదనపు డీఆర్‌డీఓ సర్పంచ్ శ్రీనివాసరావు, జేఈ (జె ఇ) కృష్ణ టీఏ టీ ఏ) ప్రవీణ్ వార్డు సభ్యులు నారాయణ, కాటమ్మఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణారావు ఐనాల కనకరత్నం పుచ్చకాయల బాబు ఉపాధి హామీ సిబ్బంది మరియు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

వరి రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలి..


- తల్లాడ మండలంలో పడిపోయిన పంట పొలాలను పరిశీలించిన..
- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య



ఖమ్మం/తల్లాడ నవంబర్ 5 (అక్షరం న్యూస్)

తల్లాడ మండలంలోని గొల్లగూడెం, బిల్లుపాడు గ్రామాల్లోమురుసు తుఫాన్ ప్రభావంతో పడిపోయిన వరి పంట పొలాలను గురువారం సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కొద్దిసేపు మాట్లాడారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే పంట నష్ట సర్వే చేసి రిపోర్టును ప్రభుత్వానికి పంపించాలని, ప్రభుత్వం కూడా రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోడూరు ఉమాదేవి, బీఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దుగ్గిదేవర వెంకట లాల్, జిల్లా నాయకులు కోడూరు వీర కృష్ణ, దగ్గుల శ్రీనివాసరెడ్డి, అశోక్, వీరయ్య, కేతినేని చలపతిరావు, ఇంజం కృష్ణార్జునరావ్, రుద్రాక్ష బ్రహ్మం, వేమ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ కి నిశ్చితార్థ ఆహ్వాన పత్రిక అందజేసిన వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



ఖమ్మం/ వైరా నవంబర్ 5 (అక్షరం న్యూస్)

ఈ నెల 6 వ తారీకు శుక్రవారం రోజున వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పెద్ద కుమార్తె డాక్టర్ మాలోత్ గాయత్రి నిశ్చితార్థ వేడుకకు హాజరుకావాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ ని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా తన కుటుంబంలో జరుగుతున్న శుభకార్యానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ ని ఆహ్వానించడం పట్ల ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు.ఈ నిశ్చితార్థ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని టీపీసీసీ అధ్యక్షులను ఎమ్మెల్యే కోరారు.

పణితి సూరమ్మ ఘన నివాళులర్పించిన డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళి కృష్ణ



ఖమ్మం/వైరా టౌన్ నవంబర్ 5 (అక్షరం న్యూస్)

వైరా మున్సిపాలిటీ 7వ వార్డుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పణితి శ్రీనివాసరావు వదిన పణితి సూరమ్మ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన దశదిన కార్యక్రమానికి డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళి కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా పణితి సూరమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పోదిల హరినాథ్, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, కౌన్సిలర్ పణితి సైదులు, తెళ్ళూరి వీరయ్య, పానెం భాస్కర్, పణితి సురేష్, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొని పణితి సూరమ్మ కి నివాళులర్పించారు.

అజయ్ మృతి పార్టీకి తీరని లోటు: పల్లా, రాజయ్య



జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరంన్యూస్) నవంబర్ 05: రఘునాథపల్లి మాజీ జడ్పీటీసీ బొల్లం అజయ్(మణికంఠ) భౌతికకాయానికి జనగామఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, స్టేషన్ ఘనాపూర్ మాజీ తాటికొండ రాజయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అజయ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మాజీ జడ్పీటీసీ బొల్లం మణికంఠ ఆత్మహత్య

- రాజకీయ కార్యక్రమాల కోసం చేసిన ఖర్చులు.. అప్పుల భారం..
- తీవ్ర మనస్తాపంతో తనువు చాలించిన మాజీ ప్రజాప్రతినిధి



జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్) నవంబర్ 05: మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ బొల్లం మణికంఠ అలియాస్ అజయ్ ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ఉదయం తీవ్ర విషాదాన్ని నింపింది. ఒకప్పుడు రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజాప్రతినిధి గా సేవలందించిన ఆయన, ఆర్థిక ఇబ్బందులు, అప్పుల భారంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక సమాచారం.గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జడ్పీటీసీగా ఎన్నికైన బొల్లం మణికంఠ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. పార్టీ కార్యక్రమాలు, రాజకీయ కార్యకలాపాల నిర్వహణలో చురుగ్గా పాల్గొనేవారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా రాజకీయ కార్యక్రమాల నిమిత్తం అధిక మొత్తంలో ఖర్చులు చేయడంతో ఆర్థిక పరిస్థితి క్రమంగా ఇబ్బందికరంగా మారినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అప్పులు చేయాల్సి రావడంతో వాటి భారం పెరిగి ఆర్థికంగా తీవ్ర ఒత్తిడికి గురైనట్లు పోలీసులకు అందిన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఇంటి నుంచి వాకింగ్‌కు వెళు న్నానని కుటుంబ సభ్యులకు చెప్పి బయటకు వెళ్లారు. అనంతరం మండల కేంద్రంలోనిపాత ప్రతిభ హైస్కూల్ ఆవరణలోని బాదం చెట్టుకు నైలాన్ తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి మృతుడి భార్య బొల్లం అనుష ఇచ్చిన ఫిర్యాదు మేరకు రఘునాథపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఆర్థిక లావాదేవీలు తదితర అంశాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఒకప్పుడు ప్రజాప్రతినిధిగా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించిన వ్యక్తి ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

తుఫాన్ నష్టంపై రైతుల పక్షాన మాజీ ఎమ్మెల్యే మెచ్చా గళం





- రూ.3.5 కోట్ల రింగుబండకు ఒక్క తుఫాన్‌కే గండి.. ప్రజాధనం వృథా
- నష్టపోయిన ప్రతి రైతుకూ తక్షణ పరిహారం చెల్లించాలి.. దెబ్బతిన్న రోడ్లు, చెరువులకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలి

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / నవంబర్ 05 / అక్షరం న్యూస్ :మురసు తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేట నియోజకవర్గంలో రైతులకు, ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు దెబ్బతిన్న ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. దెబ్బతిన్న పంట పొలాలు, గండ్లు పడిన చెరువులు, కొట్టుకుపోయిన రహదారులను పరిశీలిస్తూ బాధిత రైతులతో నేరుగా మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి సమగ్రంగా పంట నష్టం అంచనా వేయాలని, అర్హులైన రైతులందరికీ తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అచ్యుతాపురం చిన్నయ్యకట్టు చెరువుకు గండి.. రహదారి ధ్వంసం

అచ్యుతాపురం చిన్నయ్యకట్టు చెరువుకు గండి పడటంతో రహదారి పూర్తిగా కొట్టుకుపోయిన ప్రాంతాన్ని మెచ్చా నాగేశ్వరరావు పరిశీలించారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి తక్షణమే మరమ్మతులు చేపట్టి రహదారిని పునరుద్ధరించాలని సూచించారు.

దెబ్బతిన్న రహదారులు.. ప్రజలకు రాకపోకల ఇబ్బందులు

పాతనారంవారిగూడెం నుంచి గుర్రాల చెరువుకు వెళ్లే మార్గంతో పాటు పాతనారంవారిగూడెం నుంచి మొద్దులగూడెం వెళ్లే రహదారులు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ మార్గాలపై ఆధారపడే ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని కోరారు.

దొంతికుంట చెరువు గండితో రైతులకు తీవ్ర నష్టం

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని దొంతికుంట చెరువు వద్ద గండిపడటంతో నష్టపోయిన రైతులను మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం, ఆర్థిక ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కేవలం హామీలతో సరిపెట్టకుండా నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులందరికీ న్యాయమైన పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నారాయణపురంలో రైతులకు పరామర్శ.. న్యాయం జరిగే వరకు పోరాటం

నారాయణపురంలో తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి విపత్తు రైతుల ఆశలను ఆవిరి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

రూ.3.5 కోట్ల రింగుబండకు గండి.. నిర్మాణ నాణ్యతపై అనుమానాలు

గుమ్మడిపల్లి పెద్దవాగు ప్రాజెక్టు వద్ద రూ.3.5 కోట్ల వ్యయంతో నిర్మించిన రింగుబండకు గండి పడిన ప్రాంతాన్ని మెచ్చా పరిశీలించారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన పనులు ఒక్క తుఫాన్‌ను కూడా తట్టుకోలేకపోవడం నిర్మాణ నాణ్యతపై అనేక అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. కేవలం కమిషన్ల కోసమే ఈ నిర్మాణం చేపట్టారా? ఈ రింగుబండ నిర్మాణం వల్ల ఒక్క రైతుకైనా ప్రయోజనం కలిగిందా? అని ప్రశ్నించారు. రూ.3.5 కోట్ల ప్రజాధనం బూడిదలో పోసినట్లయిందని మండిపడ్డారు. పనుల నాణ్యతను పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. ముందుచూపు లేకుండా సరైన ప్రణాళికతో పనులు చేపట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. రింగుబండ నిర్మాణంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

తక్షణ సహాయక చర్యలు చేపట్టాలి.. రైతులకు పరిహారం అందించాలి

ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల పంటలు, కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులను కాపాడాల్సిన బాధ్యత పాలకులు, అధికారులపై ఉందన్నారు. విపత్తులు వచ్చినప్పుడు హడావుడిగా పర్యటించడం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని, రహదారులు, చెరువులకు శాశ్వత మరమ్మతులు చేయాలని, నష్టపోయిన ప్రతి రైతుకూ ఎలాంటి జాప్యం లేకుండా నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జూపల్లి రమణారావు, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, మోహన్ రెడ్డి, యుఎస్ ప్రకాశ్ రావు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్ ను సన్మానించిన హనుమాన్ డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /నవంబర్ -5(అక్షరం న్యూస్)

ముస్తాబాద్ మండలం అవునూర్ గ్రామానికి చెందిన బత్తుల నవీన్ నియామకం కావడం తో గ్రామానికి చెందిన హనుమాన్ డ్రైవర్ అసోసియేషన్ వారు శాలువా తో సత్కరించి సన్మానించారు. తమ తోటి డ్రైవర్ డైరెక్టర్ కావడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ప ఉమ్మనవేని వెంకటేశం, తొండల శ్రీనివాస్, ఏర్పుల శ్రీనివాస్,,ప్యారం నర్సయ్య,కోటగిరి సతీష్ గోపన్నగారి రాజకుమార్ ఎలుసాని మల్లేష్ యాదవ్ కర్రోళ్ల నర్సయ్య శ్రీనివాస్ యాదవ్ లు పాల్గొన్నారు

విద్యార్థులకు పరీక్ష ఫీజులు చెల్లించిన సామాజిక కార్యకర్త షేక్ లతీఫ్ ..



ఖమ్మం/ వైరా నవంబర్ 5 (అక్షరం న్యూస్)

సిరిపురం జడ్పీహెచ్ఎస్ పదవ తరగతి విద్యార్థులకు మరియు గరికపాడు పదో తరగతి విద్యార్థులకు 43 మంది విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించిన సామాజిక కార్యకర్త షేక్ లతీఫ్ ,ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైరా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆర్ వెంకట స్వామి మాట్లాడుతూ సామాజిక కార్యకర్త షేక్ లతీఫ్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మనలను పొందుతున్నారని ఆయన అన్నారు. సేవా కార్యక్రమాలను సామాజిక పరంగా అందిస్తున్న లతీఫ్ ను ఆయన అభినందించారు. అదేవిధంగా:- వైరా మండలం సిరిపురం కేజీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు 27 మంది విద్యార్థులకు ఆయన చేతులు మీదుగా అందించారు .ఈ కార్యక్రమంలో సిరిపురం కేజీ ప్రధానోపాధ్యాయురాలు సూర్య కుమారి స్కూల్ చైర్మన్ షేక్ బి జాన్ బి మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గరికపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు 16 మంది విద్యార్థులకు ముఖ్యఅతిథిగా గరికపాడు సర్పంచ్ నాగలక్ష్మి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు స్కూల్ చైర్మన్ గంగిదేవుల తిరుపతమ్మ ప్రధానోపాధ్యాయులు రమేష్ మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుఫాను తో వైరా నియోజకవర్గంలో పంట నష్టం..

- వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేయాలి..
- నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి
- జిల్లా నాయకులు..పోట్ల శ్రీనివాసరావు



ఖమ్మం/ వైరా నవంబర్ 5 (అక్షరం న్యూస్)

వైరా నియోజకవర్గంలో తుఫాన్ ప్రభావంతో వైరా నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాలకు రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని బీఆర్ఎస్ జిల్లా నాయకులు పోట్ల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి, బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రధానంగా వరి సాగు అధిక విస్తీర్ణంలో జరుగుతుందని, ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో వరి కోత దశకు చేరుకోగా, మరికొన్ని ప్రాంతాల్లో గింజ పోసుకునే దశలో ఉందన్నారు. ఈ తరుణంలో కురిసిన భారీ వర్షాలకు వరి పొలాలు నీట మునిగి పంట నేలకొరిగిందని, చేతికొచ్చే సమయంలో పంట దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.

ఇప్పటికే ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వరి రైతులకు మురుసు తుఫాను మరో పెద్ద దెబ్బగా మారిందన్నారు. వరితో పాటు పత్తి, మిరప, మొక్కజొన్న రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని శ్రీనివాసరావు

భవన నిర్మాణ కార్మికులను మోసం చేస్తున్న దళారులపై విచారణ చేపట్టాలి

- కార్మికుల నుంచి అక్రమంగా డబ్బుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలి. మర్లు సాయిబాబు



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/ నవంబర్ 5/ అక్షరం న్యూస్: భవన నిర్మాణ కార్మికులను మోసం చేస్తూ, లేబర్ కార్డు ల పేరుతో కొందరు దళారులు అక్రమంగా డబ్బులు వ సూలు చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ చేప ట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణకా ర్మికులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ము న్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో భవన నిర్మాణ ప నులు చేపడుతున్న ప్రదేశంలో నిజమైన భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు దరఖాస్తు పత్రాలను సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, మహామేస్త్రీ మర్లు సాయిబాబు అందజేశారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే ప్రతి కా ర్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు కలిగి ఉండాలని ఆ యన సూచించారు.1996 భవన నిర్మాణ కార్మికుల చ ట్టం ద్వారా కార్మికుల సంక్షేమం కోసం పలు పథకాలు అ మలు చేస్తున్నారని, వాటి ఫలాలు నిజమైన కార్మికులకు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.5 వేల పింఛన్ సౌకర్యం కల్పించాలని,కార్మికుడు జీవించిఉన్నం తకాలం లేబర్ కార్డు కొనసాగించాలని ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు.అదేవిధంగా ప్రభుత్వ భవన నిర్మాణాల శిలాఫలకాలపై పనిచేసిన తాపీ మేస్త్రీ పేరును కూడా న మోదు చేయాలని, కార్మికులకు ప్రభుత్వం నుంచిరూ.10 లక్షల సబ్సిడీ అందించేలా చర్యలు తీసుకోవాలని మర్లు సాయిబాబు కోరారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మర్లు సాయిబా బుతో పాటు కార్మికులు ఆశయ, బాలయ్య, మైపాల్, మ ల్లేష్, అరవింద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బంధనకల్ పాఠశాల లో ఆకట్టుకున్న మాక్ పోలింగ్



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /నవంబర్ -05(అక్షరం న్యూస్)

ముస్తాబాద్ మండలంలోని బంధన్ కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురు వారం విద్యార్థులు మాక్ పోలింగ్(నమూనా ఎలక్షన్)ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల విధానం, ఓటు విలువ గురించి ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథి గా గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ హాజరై విద్యార్థుల ఉత్సాహాన్ని ప్రశంసించారు. ఆరో నుంచి పదోతరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఎన్నికలో పోటీదారులుగా.. ఓటర్లుగా.. ఎన్నికల సిబ్బందిగా.. పోలీసులుగా విధులు నిర్వహించి అలరించారు.పోలింగ్ ప్రక్రియ ను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ బూత్ విధానం లో నిర్వహించారు.విద్యార్థులకు ఎన్నికల విధానంపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్‌ను నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు రాజ్ కుమార్ పేర్కొన్నారు.సర్పంచ్ నరేష్ మాట్లాడు తు మాక్ పోలింగ్ కార్యక్రమం ల వల్ల విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు,బాధ్యత భావం ప్రజాస్వామ్య విలువలు పెంపొందుతాయన్నారు ఈ కార్యక్రమం లో వార్డు సభ్యుడు వెంకట్ రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 8 మంది పట్టివేత.. రూ.24,600 నగదు, 6 సెల్‌ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం.



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/ నవంబర్ 5/ అక్షరం న్యూస్: ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామంలో పే కాట ఆడుతున్న స్థావరంపై గురువారం సాయంత్రంఎ ల్లారెడ్డి పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పే కాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను పోలీసులు పట్టు కున్నారు.వారి వద్ద నుంచి రూ.24,600 నగదు,6 మొబై ల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నా రు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పట్టుబడిన వ్యక్తు లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ ఎన్. రాజు తెలిపారు.

కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే మదన్ మోహన్

●పోతాయిపల్లిలో ఐదు మృతుల కుటుంబాలకు పరామర్శ.. ఆర్థిక సహాయం అందజేత.



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి:లింగంపేట/నవంబర్5/ అక్షరం న్యూస్: ఎల్లారెడ్డి డివిజన్, లింగంపేట్ మండల కేంద్రంలోని పోతాయిపల్లి గ్రామంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ గురువారం పర్యటించి ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన ఐదు కుటుంబాలను పరా మర్శించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సా నుభూతి తెలిపి, మనోధైర్యం కల్పించడంతో పాటు కు టుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సం దర్భంగా ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెంది న గ్రామ మాజీ సర్పంచ్, పీఏసీఎస్ డైరెక్టర్ ఆకుల లక్ష్మీ నారాయణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శిం చి ధైర్యం చెప్పారు.అదేవిధంగా ఇటీవల మృతి చెందిన పెద్దబోయిన చిన్న సాయిలు మాతృమూర్తి కుటుంబ స భ్యులను, గారిబోయిన భీమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. కాంగ్రెస్ పా ర్టీ వార్డు సభ్యుడు ఎర్రం సంజీవులు మృతి పట్ల విచా రం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే గన్నారం చిన్న సాయిలు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయంఅం దించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ ఆపద సమయంలో బాధిత కుటుంబాల కు అండగా నిలవడం, వారికి మనోధైర్యం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.మృతుల కుటుంబా లకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,భవిష్యత్తు లోనూ వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎ మ్మెల్యే పర్యటనతో బాధిత కుటుంబాలకు కొంత ఊరట లభించింది. కష్టకాలంలో వారికి అండగా నిలిచి ఆర్థిక స హాయం అందించడం ద్వారా మదన్ మోహన్ తనమా నవీయతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మె ల్యే వెంట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నా యకులు గ్రామస్తులు ఉన్నారు.

ఖమ్మంలో బియ్యం దుకాణాలపై సంయుక్త తనిఖీలు: 53 బియ్యం బస్తాలు సీజ్, వ్యాపారులకు జరిమానా

●జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్



ఖమ్మం /టౌన్ నవంబర్ 5 (అక్షరం న్యూస్)

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా పౌర సరఫరాల అధికారి, లీగల్ మెట్రాలజీ అధికారి సంయుక్తంగా ఖమ్మం పట్టణంలోని పలు కిరాణా, రైస్ స్టోర్లలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్ అన్నారు. ఈ తనిఖీల సమయంలో బియ్యం బస్తాలపై ముద్రించిన బరువు కంటే తక్కువ బరువు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు, నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను అమలులో ఉన్న లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం సంబంధిత వ్యాపారులపై జరిమానా విధించడమే కాకుండా, తక్కువ బరువు ఉన్న బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.ఈ తనిఖీల్లో భాగంగా మామిళ్లగూడెంలోని లక్ష్మీ వేంకటేశ్వర కిరాణా ఁ జనరల్ మర్చంట్ లో రూ. 18 వేల విలువుగల 12 బస్తాలు, శ్రీ లక్ష్మీ బాలాజీ కిరాణా ఁ జనరల్ స్టోర్ లో రూ. 28,500 విలువుగల 15 బస్తాలు సీజ్ చేశారన్నారు. అలాగే కస్బా బజార్‌లోని షేక్ జానీమియా రైస్ స్టోర్స్ లో రూ. 7,500 విలువుగల 5 బస్తాలు, సుపీరియర్ ఎంటర్ ప్రైజెస్ లో రూ. 42 వేల విలువుగల 21 బియ్యం బస్తాలను అధికారులు సీజ్ చేశారన్నారు. మొత్తంగా నాలుగు దుకాణాల్లో కలిపి రూ. 96 వేల విలువైన 53 బియ్యం బస్తాలను సీజ్ చేసినట్లు పౌర సరఫరాల అధికారి తెలిపారు.ఈ సందర్భంగా పౌరసరఫరాల అధికారి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. బియ్యం బస్తాలపై ముద్రించిన తూకం ప్రకారమే విక్రయాలు జరపాలని, తూకంలో తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. వినియోగదారులకు సరైన పరిమాణంలో సరుకులు అందేలా చూడటానికి జిల్లాలోని వ్యాపారులందరూ అధికారుల తనిఖీలకు సహకరించాలని కోరారు.

చీకోడ్ లో మహిళా సంఘం భవనానికి స్లాబ్ పూర్తి: సర్పంచ్, అధికారులు హాజరు

రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /నవంబర్ -05(అక్షరం న్యూస్)

ముస్తాబాద్ మండలం చీకోడ్ గ్రామంలో మహిళా సంఘం నూతన భవన నిర్మాణ పనులు వేగవంతమయ్యాయిరూ. 10 లక్షల వ్యయంతో మంజూరైన మహిళా బిల్డింగ్ స్లాబ్ పనులను ప్రారంభించారు.బుధవారం భవనానికి సంబంధించిన స్లాబ్ వేసే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొమ్మేన ఆంజనేయులు ఉపసర్పంచ్ అస రంజిత్ , వార్డ్ సభ్యులు,కరెడ్ల సునంద,గున్నాల వెంకటస్వామి, బానుక నాగరాజు, మాజీ ఎంపీటీసీ కొప్పు లక్ష్మణ్, మహిళ సంఘాల నాయకురాళ్లు, అధికారులు,గ్రామస్తులు పాల్గొన్నారు



వరద విపత్తు పై అధికారుల చర్యలకు అభినందనలు





●రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

●ఎస్డీఆర్ఎఫ్ పటిష్టంతో సత్ఫలితాలు..

●వరద సహాయక చర్యలు, నష్టం అంచనాలపై ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి..

ఖమ్మం / స్టాఫ్ రిపోర్టర్ /సత్తుపల్లి, నవంబర్ 5(అక్షరం న్యూస్)

వరద విపత్తుపై అధికారులు సమన్వయంతో తీసుకున్న చర్యలు, ప్రాణనష్టం లేకుండా

చేపట్టిన చర్యలను రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. గురువారం సింగరేణి కాలరీస్ గెస్ట్ హౌజ్ లో బేతుపల్లి వరద సహాయక చర్యలు, వరద ముంపు నష్టాలపై ఉమ్మడి ఖమ్మం జిల్లాల కలెక్టర్లు, సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట నియోజకవర్గం అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి మండలాలు, ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి నియోజకవర్గం సత్తుపల్లి హెడ్‌క్వార్టర్స్ పరిధిలో సంభవించిన వరదలు, వాటి నష్టాలపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించామన్నారు. రాత్రి సమయంలో ముంపు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన మత్స్యకారులను రక్షించడానికి వెళ్లిన ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి రక్షించారన్నారు. బోట్లు బోల్తా పడినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగినప్పటికీ, రాత్రి నుంచి ఉదయం వరకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా అందరినీ సురక్షితంగా కాపాడటం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి రాత్రి రెండు పర్యాయాలు ప్రత్యేకంగా మాట్లాడి, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై వెంటనే స్పందించాలని ఆదేశించారన్నారు. కలెక్టర్లు, అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ పర్యవేక్షించడం వలన పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. 2023 డిసెంబర్‌లో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత, 2024 ఆగస్టు చివరిలో మున్నేరు వాగు ఊహించని రీతిలో సుమారు 76-77 అడుగుల ఎత్తుతో ప్రవహించినప్పుడు భారీ నష్టం వాటిల్లిందని, అప్పట్లో ఎస్డీఆర్ఎఫ్ దగ్గర తగిన పరికరాలు లేకపోవడాన్ని గమనించిన ముఖ్యమంత్రి, మంత్రులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ విపత్తు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.పోలీసు శాఖ నుంచి 1200 మందిని, ఫైర్ డిపార్ట్‌మెంట్ నుంచి 700 మందిని ఎంపిక చేసి ఎస్డీఆర్ఎఫ్‌ను పటిష్టం చేయడంతో పాటు, మొత్తం 1,900 మంది సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇచ్చామన్నారు. సుమారు రూ. 260-270 కోట్ల వ్యయంతో అత్యుత్తమ అత్యాధునిక పరికరాలను ఎస్డీఆర్ఎఫ్ కు ప్రభుత్వం సమకూర్చిందన్నారు. ఫలితంగా రాష్ట్రంలో ఏ మూలన విపత్తు వచ్చినా 45 నుండి 50 నిమిషాల లోపు సహాయక చర్యలు అందించేలా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని, ప్రాణనష్టం జరగకుండా అహర్నిశలు శ్రమించిన అధికారులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, ప్రజాప్రతినిధులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక అభినందనలు తెలిపారు.రాష్ట్రంలో సంభవించిన భారీ వర్షాలు, విపత్తు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అత్యంత వేగంగా స్పందించిందని, ఎక్కడా ఎటువంటి ప్రాణహాని జరగకుండా పూర్తి స్థాయిలో ప్రాణాలను, ఆస్తులను కాపాడగలిగామని మంత్రి అన్నారు. విపత్తు సంభవించిన వెంటనే కేవలం 30 నుంచి 35 నిమిషాల వ్యవధిలోనే రెస్క్యూ టీమ్‌లు రంగంలోకి దిగాయని తెలిపారు.నీళ్లలో ఇరుక్కుపోయిన వారిని సెల్‌ఫోన్ల ఆధారంగా గుర్తించి, టెక్నాలజీని, మ్యాన్‌పవర్‌ను సద్వినియోగం చేస్తూ సింగిల్ ప్రాణహాని కూడా జరగకుండా రక్షించడం జరిగిందన్నారు. రాత్రింబవళ్ళు నిద్రలేకుండా కష్టపడి పనిచేసిన ప్రతి అధికారిని, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంబంధిత శాఖా మంత్రిగా అభినందించారు. అశ్వారావుపేట నియోజకవర్గం, సత్తుపల్లి తదితర ప్రాంతాలలో విద్యుత్ శాఖ, నీటిపారుదల శాఖ, ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో జరిగిన నష్టాన్ని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించాలన్నారు. కొన్ని ప్రాంతాలలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు తెగడం, చెరువులు పొంగిపొర్లడం వల్ల కింద ఉన్న వరి ఇతర పంటలు దెబ్బతిన్నాయనారు. మల్లెపూవు వాగు ప్రవహించడం వల్ల డౌన్‌స్ట్రీమ్‌లో ఉన్న పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. రోడ్లపైకి చెత్తాచెదారం, వరద నీరు చేరడం వల్ల కొన్ని చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్ రోడ్లకు వాటిల్లిన నష్టాన్ని అంచనా వేయాలన్నారు. విపత్తు ప్రాతిపదికన రానున్న 2-3 రోజుల్లోగా నష్టానికి సంబంధించిన పూర్తి స్థాయి డీటెయిల్డ్ ఎస్టిమేట్స్‌ను ప్రభుత్వానికి సమర్పించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించడం జరిగిందన్నారు.

కేవలం అధికారుల అంచనాలే కాకుండా, కలెక్టర్లు, వ్యవసాయ శాఖాధికారులు స్వయంగా ఫీల్డ్ విజిట్లు నిర్వహించి, నిజంగా నష్టపోయిన రైతులను గుర్తించి ఆ వివరాలు పంపాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. . గత 36 గంటలుగా నిరంతరం శ్రమించి, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విపత్తు నిర్వహణలో కష్టపడిన ఎస్డీఆర్ఎఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ సిబ్బందిని మంత్రి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సిబ్బందిలో ఎవరికైనా ఇళ్లు లేని పక్షంలో, వారికి ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడతామని, అర్హులైన వారి జాబితాను పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్, వ్యవసాయ, విద్యుత్, తాగునీరు శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల వారీగా జరిగిన వాస్తవ నష్టాలపై తక్షణ నివేదికను రానున్న 2-3 రోజుల్లో అందజేయాలని మంత్రి ఆదేశించారు.సమీక్షలో పాల్గొన్న ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో సంభవించిన ఆకస్మిక వరద పరిస్థితులలో సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద చిక్కుకున్న మత్స్యకారులను జిల్లా యంత్రాంగం, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాల అప్రమత్తతతో పూర్తిగా రక్షించడం జరిగిందన్నారు. చెరువు నీటి మట్టం, ప్రవాహ ఉధృతి సమయంలో సాయంత్రం సుమారు 5:00 గంటల సమయంలో 8 మంది మత్స్యకారులు తెప్ప బోటును వేసుకుని చెరువులోకి వెళ్లడం జరిగిందని, వరద ఉధృతి పెరగడంతో వారు అక్కడే ఇరుక్కుపోవడం జరిగిందని తెలిపారు. అధికారులు స్పందించి, తక్షణ సహాయక చర్యల కోసం అందరినీ సమాయత్తం చేశామన్నారు. అప్పటికే భద్రాచలంలో విధులు నిర్వహిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందాన్ని ఇక్కడికి తక్షణమే రప్పించగా, వారు కేవలం 25 నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకున్నారన్నారు. మొదటి బోటు ద్వారా వెళ్లి, ఈత రాని ముగ్గురు మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చారున్నారు. ఆ తర్వాత రెండవ బోటు సహాయంతో మిగతా వారిని రక్షించడానికి వెళ్లిన సమయంలో, వరద ప్రవాహం మరింత పెరగడంతో రెండు బోట్లు బ్యాలెన్స్ కోల్పోయి ఎస్డీఆర్ఎఫ్ బృందం కూడా నీటిలో పడిపోవడం జరిగిందని తెలిపారు. తక్షణమే అప్రమత్తమైన యంత్రాంగం విజయవాడ నుండి కెప్టెన్ కిరణ్, నీరజ్ ల నేతృత్వంలోని ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రప్పించామని తెలిపారు. పోలీసు శాఖ, ఇతర యంత్రాంగం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ లొకేషన్ ట్రేసింగ్ ఉపయోగించి రాత్రి సమయంలో కూడా గాలింపు చర్యలు ముమ్మరం చేశారన్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సాహసోపేతంగా వ్యవహరించిన ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, పోలీసు యంత్రాంగం చొరవతో మొత్తం 8 మంది మత్స్యకారులను, రెస్క్యూ సిబ్బందిని ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా పూర్తిగా రక్షించగలిగామన్నారు. ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న విపత్తు యంత్రాంగానికి కలెక్టర్ అభినందనలు తెలిపారు.సమీక్షలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాకు రెడ్ అలర్ట్ నేపథ్యంలో నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ , అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధమై, సహాయక చర్యలను వేగవంతం చేసిందని తెలిపారు. గతంలో భద్రాచలం డివిజన్ చెర్ల, దుమ్ముగూడెం, గోదావరి పరివాహక ప్రాంతాల పరిధిలో వరద ముప్పు ఎక్కువగా ఉండేదని, అయితే ఈసారి కొత్తగూడెం డివిజన్‌లో ముందెన్నడూ లేని విధంగా అత్యంత భారీ వర్షపాతం నమోదైందని అన్నారు.

వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన వెంటనే రెవెన్యూ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పోలీసు శాఖలతో పాటు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఇతర విభాగాల అధికారులు, పంచాయతీ కార్యదర్శుల నుండి జిల్లా స్థాయి అధికారుల వరకు అందరినీ అలర్ట్ చేసి హెడ్‌క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు.

ముల్కలపల్లి సమీపంలో ఐటీడీఏ వైపు వెళ్తుండగా వరదలో చిక్కుకుని, చెట్టుపై తలదాచుకున్న 40 సంవత్సరాల మహిళను ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సురక్షితంగా రక్షించాయన్నారు. ముల్కలపల్లిలోనే వాగు ప్రవాహం ఒక్కసారిగా పెరిగిన వేళ, ఒక 20 ఏళ్ల యువకుడు ప్రాణాపాయ స్థితిలో చెట్టుపైకి ఎక్కగా, అతనికి లైఫ్ జాకెట్లు, రోప్‌లు, డ్రోన్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారన్నారు. దేవాలయాన్ని దర్శించుకునేందుకు వెళ్లిన 11 మంది గిరిజనులు వరద నీటిలో చిక్కుకోగా, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకుని వారందరినీ క్షేమంగా బయటకు తరలించాయన్నారు. తదనంతరం అదే బృందం సత్తుపల్లిలోని అత్యవసర ప్రాంతానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొందన్నారు. భారీ వర్షాల కారణంగా వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లిందని, అలాగే పలు ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయని తెలిపారు. అన్ని శాఖల అధికారులతో పూర్తిస్థాయి క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి, రాబోయే రెండు రోజుల్లో కచ్చితమైన నష్ట పరిహార నివేదికలను ప్రభుత్వానికి సమర్పిస్తామని కలెక్టర్ తెలిపారు.

సమీక్షలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ మాట్లాడుతూ, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితుల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, ఎస్.డి.ఆర్.ఎఫ్, ఎన్.డి.ఆర్.ఎఫ్, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా విజయవంతంగా సహాయక చర్యలు పూర్తి చేశాయన్నారు. వరద ముప్పును ముందే అంచనా వేసి, ములకలపల్లి పోలీస్ స్టేషన్, దమ్మపేట, అశ్వారావుపేటలలో ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలను ముందుగానే స్టాండ్‌బై ఉంచడం జరిగిందన్నారు.

సత్తుపల్లి ప్రాంతంలో వరద ఉధృతి పెరిగిన వెంటనే, కలెక్టర్ ఆదేశాల మేరకు దమ్మపేట, కొత్తగూడెం వైపు ఉన్న ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలను ఆ ప్రాంతానికి రప్పించడం జరిగిందని, తొలి విడతలో ముగ్గురు మత్స్యకారులను సురక్షితంగా రెస్క్యూ చేసామన్నారు. అనంతరం నీటి మట్టం మరింత పెరగడంతో, 6వ బెటాలియన్ ఎన్.డి.ఆర్.ఎఫ్, ఫైర్ డిపార్ట్‌మెంట్ బృందాలు కూడా రంగంలోకి దిగాయని, రాత్రంతా శ్రమించి మరో ఐదుగురిని రక్షించడం జరిగిందన్నారు. ఉదయం 5:30 గంటల నుండి రెండవ విడత ఆపరేషన్ ప్రారంభించి, డ్రోన్లు, ఆధునిక పరికరాలు, మోటార్ బోట్లను ఉపయోగించి చెట్లపై చిక్కుకున్న వారి లొకేషన్లను మ్యాప్ చేసి ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాల సహాయంతో నిర్దిష్ట ప్రణాళికతో అందరినీ సురక్షితంగా కాపాడడం జరిగిందన్నారు. ఈ సమయంలో రెవెన్యూ, పోలీస్, ఎన్.డి.ఆర్.ఎఫ్, ఎన్.డి.ఆర్.ఎఫ్, అగ్నిమాపక శాఖల అధికారులు, సిబ్బంది అందరూ అంకితభావంతో రేయింబవళ్లు శ్రమించడం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ప్రశాంతంగా రెస్క్యూ ఆపరేషన్లు ముగిసాయని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, ఖమ్మం జిల్లా యంత్రాంగం చేపట్టిన పకడ్బందీ చర్యల వల్ల ప్రజల ప్రాణాలు పూర్తిగా కాపాడబడ్డాయన్నారు.సమీక్షలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, అకస్మాత్తుగా ఎదురైన విపత్తును సమన్వయంతో, సాహసంతో ఎదుర్కొని అందరినీ రక్షించారాని, అధికారులు, సహాయక బృందాలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర జిల్లా యంత్రాంగం, అధికారులు అందరూ సమన్వయంతో పనిచేశారన్నారు.సమీక్షలో పాల్గొన్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, రెవెన్యూ, పోలీస్, విపత్తు నిర్వహణ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాణనష్టం లేకుండా చూశారన్నారు. వరదతో జరిగిన పంట నష్టాన్ని అందించాలన్నారు. విపత్తులో పాల్గొన్న వారిని అభినందించారు.ఈ సమీక్షా సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఉమ్మడి జిల్లా వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ జూదానికి నో చెప్పండి

● కేవలం 12 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న సిద్ధిపేట పోలీస్.

సిద్ధదిపేట జిల్లా / దుబ్బాక / నవంబర్ 5 / అక్షరం న్యూస్ -:

ఘటనపై వెంటనే స్పందించిన సిద్ధిపేట వన్‌టౌన్ పోలీస్, టూటౌన్ పోలీస్ మరియు సీసీఎస్ పోలీస్ బృందాలు సమన్వయంతో పనిచేసి కేవలం 12 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారు .నిందితుడి నుంచి చోరీ చేసిన బంగారు ఆభరణంతో పాటు, నేరానికి ఉపయోగించిన కారును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ప్రజలకు పోలీసుల హెచ్చరిక:



ఆన్‌లైన్ జూదం, గేమింగ్ వ్యసనం మరియు సులభంగా డబ్బు సంపాదించవచ్చనే మోసపూరిత ఆశలకు దూరంగా ఉండండి. చిన్నగా ప్రారంభమయ్యే వ్యసనం ఆర్థికంగా నష్టపరచడమే కాకుండా నేరాలకు దారితీయవచ్చు అని సిద్దిపేట జిల్లా పోలీస్ ఏ సి పి చెప్పటం జరిగింది.

అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి టపాసులపై టాస్క్‌ఫోర్స్ దాడులు..

●రూ.లక్ష విలువైన టపాసులు స్వాధీనం

ఖమ్మం/ స్టాప్ రిపోర్టర్ నవంబర్ 5 (అక్షరం న్యూస్)

దీపావళి పండుగ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచి విక్రయించే వారిపై ఖమ్మం పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొరడా ఝళిపించారు. ఖమ్మం నగరంలోని చర్చికాంపౌండ్ రోడ్డులో రంగచారి హాస్పిటల్ ఎదురుగా వున్నా నల్లా బాలకృష్ణ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులపై టాస్క్‌ఫోర్స్ సిఐ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి సుమారు రూ.లక్ష విలువైన టపాసులను స్వాధీనం చేసుకొని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు అప్పగించారు.ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులను నిల్వ ఉంచడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ప్రమాదం కలిగించే విధంగా నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.దీపావళి పండుగను ప్రజలందరూ సురక్షితంగా జరుపుకోవాలని, అనుమతులు కలిగిన విక్రయ కేంద్రాల నుంచే టపాసులు కొనుగోలు చేయాలని సూచించారు. అక్రమ టపాసుల నిల్వలు, విక్రయాలపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

కాంగ్రెస్ కార్యకర్తకు ఎమ్మెల్యే మదన్ మోహన్ భరోసా

●ముస్తాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ.



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి :లింగంపేట్ /నవంబర్ 5/అక్షరం న్యూస్: ఎల్లారెడ్డి నియోజకవర్గం లింగంపేట మండలం ముస్తాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మాలకమ్మరి సిద్ధయ్యకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మదన్ మోహన్ గురువారం భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ విజయానికి, తన గెలుపు నకు కృషి చేసిన ప్రతి కార్యకర్త సేవలను ఎప్పటికీగుర్తుం చుకుంటానని తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమిం చిన కార్యకర్త మాలకమ్మరి సిద్ధయ్యకు అర్హత ప్రాతిపది కన ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం సంతోషకరమ ని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్త లకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించడంతో పాటు అర్హు లైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిరుపేదలసొం తింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్లపథకం ప్రధాన ఉద్దేశమని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నూతన పీఏసీఎస్ చైర్మన్లు, సీ నియర్ కాంగ్రెస్ నాయకులు, మండల నాయకులు,ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులుపా ల్గొన్నారు.

ఘనంగా 17వ వార్డ్ కౌన్సిలర్ పుట్టినరోజు వేడుకలు

● రక్తదానం చేసిన తమ్ముళ్లు



పెద్దపల్లి టౌన్ నవంబర్ 05 అక్షరం న్యూస్

పెద్దపల్లి పట్టణ 17వ వార్డ్ కౌన్సిలర్ తోట ఫణిందర్ పుట్టినరోజు వేడుకలు గురువారం రోజున అభిమానులు వారి తమ్ముళ్లు మధ్యలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పెద్దపల్లి ప్రభుత్వ హాస్పిటల్ రక్తనిది కేంద్రంలో అభిమానులు రక్తదానం చేయడం జరిగింది అనంతరం హాస్పిటల్ లో పలువురి రోగులకు పండ్లు బ్రేడ్ అందించారు అభిమానులు మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని వారికి భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని అష్ట ఐశ్వర్యాలతో ఆరోగ్యవంతంగా పరిపాలన కొనసాగించాలని కోరారు ఈ సందర్భంగా కేకు కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు....

చొప్పదండి పీఏసీఎస్ద్వారా ప్పు దినుసుల పంటలకి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ కార్యక్రమం

●ప్రారంభం చేయనున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి/ కరీంనగర్, నవంబర్ 05 (అక్షరం న్యూస్)

శుక్రవారం నవంబర్ ఆరవ తేదీన ఉదయం 10 గంటలకు చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన కరువు పరిస్థితుల్లో వరికి ప్రత్యామ్నయంగా పప్పు దినుసుల పంటలను ప్రోత్సహించి రైతులకు అండగా నిలబడాలన్న గొప్ప సంకల్పంతో దేశంలో ఎక్కడా లేని విధంగా చొప్పదండి సహకార సంఘం తమ సంఘ సభ్యులకు ప్రభుత్వ మద్దతు ధరకు అదనంగా క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లించే కార్యక్రమాన్ని ప్రారంభించడానికి చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం ప్రారంభం చేయుచున్నారని చొప్పదండి పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

వరద బాధితులకు బీఆర్ఎస్ నాయకుల అండ.. బియ్యం, కూరగాయల పంపిణీ





● 25 కుటుంబాలకు నిత్యావసర సరుకుల అందజేతలిలి

● కేసప్పగూడెం కే.సీ.ఆర్ కాలనీలో బాధితులకు పరామర్శ

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / నవంబర్ 05 / అక్షరం న్యూస్ :అశ్వారావుపేట మండలంలోని కేసప్పగూడెం గ్రామం కే.సీ.ఆర్ కాలనీలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఇళ్లన్నీ నీటమునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లలోని నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు, ఇతర వస్తువులు నీట మునగడంతో సుమారు 25 కుటుంబాలు నష్టపోయాయి. ఈ విషయం తెలుసుకున్న అశ్వారావుపేట మండల బీఆర్ఎస్ నాయకులు గురువారం కాలనీలో పర్యటించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు బియ్యం, కూరగాయలు పంపిణీ చేసి తమ వంతు సహాయాన్ని అందించారు.

25 కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

కాసాని చంద్రమోహన్--పద్మ, డా. భూక్యా ప్రసాద్--డా. ఉదయ జ్యోతి ఆధ్వర్యంలో వరద బాధిత 25 కుటుంబాలకు బియ్యం, కూరగాయలను పంపిణీ చేశారు. వరదలతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు అవసరమైన సహాయం అందిస్తూ బాధితులకు అండగా నిలిచారు.

బాధితులకు అండగా ఉంటామని భరోసా

వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలను నాయకులు పరామర్శించి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. బాధితులకు తమ వంతు సహాయాన్ని అందిస్తూ కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు.

పర్యటనలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఈ కార్యక్రమంలో కేసప్పగూడెం సర్పంచ్ సోడెం భారతి, వార్డు సభ్యులు కొవ్వసి భారతి, సోయం వెంకటమ్మ, సున్నం పార్వతి, వేదాంతాపురం సర్పంచ్ సోడెం ముత్యాలరావు, పిల్లెం బొత్తయ్య, సొంధెం ముత్యాలరావు, సొంధెం కృష్ణ, వేదాంతపురం మాజీ సర్పంచ్ సోమిని శివశంకర్ ప్రసాద్, అశ్వారావుపేట టౌన్ ప్రెసిడెంట్ సత్యవరపు సంపూర్ణ, గూడవర్తి వెంకటేశ్వరరావు, జజ్జురపు శ్రీరామమూర్తి, తగరం జగన్నాథం, శెట్టిపల్లి రఘురామ్, జక్కం బలరామకృష్ణ, రాజనాల గంగాధర్, మోటూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధిని ఓర్వలేకే ఎంపీ వంశీకృష్ణపై కుట్రపూరిత విమర్శలు



● నేతకాని మహర్ సంఘం,సమతా సైనిక్ దళ్ నాయకులు

పెద్దపల్లి టౌన్ నవంబర్ 05 అక్షరం న్యూస్

పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ గడ్డం వంశీకృష్ణపై రాజకీయ దురుద్దేశంతో కొందరు వ్యక్తులు చేస్తున్న నిరాధార ఆరోపణలను, అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని నేతకాని మహర్ సేవా సంఘం,సమతా సైనిక్ దళ్ నాయకులు స్పష్టం చేశారు.జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి నేతకాని,వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మడి కుమార్,సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గం నగేష్,భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు మౌల్కర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూఎంపీగా గెలిచిన నాటి నుంచి వంశీకృష్ణ నియోజకవర్గ ప్రగతికి విశేషంగా కృషి చేస్తున్నారని వారు తెలిపారు.మంచిర్యాలలో నేతకాని భవన నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి కోటి రూపాయల నిధులు కేటాయించారని గుర్తుచేశారు.గెజిట్‌లో నేతాని అని తప్పుగా ఉన్న పదాన్ని నేతకాని గా సవరించేందుకు రాష్ట్ర,కేంద్ర గెజిట్లలో ఆయన తీవ్ర కృషి చేస్తున్నారని వివరించారు.వారి తండ్రి రాష్ట్ర మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి సైతం నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు కోసం అసెంబ్లీలో పోరాడుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో బసంత్ నగర్ విమానాశ్రయం,రామగిరి ఖిల్లా అభివృద్ధి,ఆర్ఎఫ్సీఎల్ వంటి కీలక అంశాలపై ఎంపీ వంశీకృష్ణ కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని కొనియాడారు.బాబాసాహెబ్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాల్సిన కొందరు దళితులు,అగ్రకుల శక్తుల అడుగులకు మడుగులొత్తుతూ ఎంపీ వంశీకృష్ణపై సేగ్గం రాజేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.దళితుల మధ్య చిచ్చుపెట్టేందుకు ఇలాంటి చౌకబార వ్యక్తులతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇకనైనా కుట్రపూరిత విమర్శలు,సంస్కారహీనమైన భాషను మానుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు సోదరి తిరుపతి, ఉపాధ్యక్షులు కొత్తపల్లి గంగేష్,జాడి రాజేష్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గోమస శ్రీకాంత్,కోశాధికారి దుర్గం చరణ్ దాస్, సీనియర్ నాయకులు సల్లూరి కిష్టయ్య, నాయకురాళ్లు జాడి కల,సేగ్గం చంద్రమ్మ, గవ్వల అనితలతో పాటు పలు దళిత సంఘాల నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు

ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్‌పై నివేదిక ఇవ్వాలి

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

● వీవో భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని స్పష్టీకరణ

పెద్దపల్లి టౌన్ నవంబర్ 05 అక్షరం న్యూస్

ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో గురువారం భూముల రిజిస్ట్రేషన్, వీబీజీ రామ్‌జీ పథకం కింద మంజూరైన గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణాల పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి,అధికారులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టేందుకు చట్టపరమైన అంశాలు,ప్రభుత్వ మార్గదర్శకాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి నివేదిక అందించాలన్నారు.



ప్రభుత్వ ప్రయోజనాలు కాపాడుతూనే,అర్హులైన ప్రజలకు మేలు జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు రూపొందించాలని స్పష్టం చేశారు.అనంతరం వీబీజీ రామ్‌జీ పథకం పనులపై సమీక్షిస్తూ,మంజూరైన అన్ని వీవో భవనాల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.సామగ్రి కొనుగోలు,నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని,పూర్తయిన భవనాలను వెంటనే సంబంధిత సంఘాలకు అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో కాళిందిని,డీసీవో శ్రీమాల,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ తదితరులు పాల్గొన్నారు

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609